ప్రజాశక్తి

Vol. 5, no. 10

(Sept. 6, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 5, no. 10

(Sept. 6, 1944)

Bejavāḍa, 1944


Record no. 683

Regd. No. M. 4486 0.2.0

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 5 సంచిక 10	: సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ	★	పుచ్చలపల్లి సుందరయ్య తుమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు	బుధవారం 6-9-44



"తలదాచుకోడాని కింత స్థలంకోసమే మనం యుద్ధంచేశాం." అని [illegible] "అవును ఆస్థలం సీకు అధఃపాతాళమే" అంటు ఆవాదిస్తున్నాయి [illegible] ప్రజాశక్తులు. ([illegible])

స్వయంనిర్ణయసూత్రం న్యాయమైన ప్రజాస్వామ్యకోరిక

★

గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారి వివరణ

— మా ప్రత్యేక విలేఖరి

శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు మన ఆంధ్రజాతియొక్క విజ్ఞాన వికాసాలను అభివృద్ధిచేయడానికి అనేక విధాల పాటుబడుతున్నారు. ప్రత్యేకాంధ్రరాష్ట్ర నిర్మాణానికి పట్టుదలతో పనిచేసే ప్రతిభాశాలి; ప్రస్తుతం ఆంధ్రమహాసభకు ప్రధానకార్యదర్శి. గ్రంథాలయోద్యమంలో మంచి అనుభవజ్ఞులు. ప్రజాసామాన్యంలో వయోజన విద్యను వ్యాపింపజేసి. ఆంధ్రజాతిని వికాసవంతమైన జాతిగా చేయవలెనని ఉవ్విళ్లూరుతారు.

హరిసర్వోత్తమరావుగారు "వందేమాతరం" ఉద్యమంలో మూడేండ్లు కఠినశిక్షననుభవించి వచ్చినప్పటినుంచీ. కాంగ్రెసువాది. అయితే విశాలహృదయంగల కాంగ్రెసువాది. కమ్యూనిస్టుపార్టీయొక్క "ప్రజా యుద్ధ" పాలసీతో వీరు ఏకీభవించరు: గాని ప్రజల జీవితసమస్యలలో కమ్యూనిస్టులు నిరంతరం పాల్గొని పనిచేస్తూన్నందుకు వారిని అభినందిస్తారు.

ప్రస్తుత జాతీయ. అంతర్జాతీయ సమస్యలపై వారి అభిప్రాయాలు తెలుసుకుందామని మొన్న 29 వ తేదీని నేను హరిసర్వోత్తమరావుగారిని సందర్శించాను. గాంధీజీ జిన్నాల సంప్రతింపుల్ని గురించి మీ అభిప్రాయం ఏమిటని మొదట నేనడిగిన ప్రశ్న. దానికి హరిసర్వోత్తమరావుగారిలా జవాబుచెప్పారు:

"గాంధీజీజిన్నాసాహెబ్‌తో సంప్రతింపులు జరిపి, రాజీకి సకలప్రయత్నాలుగావిస్తున్నారు. ఆ ప్రయత్నాలు సఫలం కావడానికి గాంధీజీకి మనమంతా సంపూర్ణమైన స్వేచ్ఛ నీయవలసియుండ."

ప్రశ్న : అనగా మీ అభిప్రాయం ఏమిటి ?

జవాబు : కాంగ్రెసు వాదులలో కొందరు గాంధీజీ నాయకత్వంపట్ల సంపూర్ణ విశ్వాసం ప్రకటిస్తూ. మరొకప్రక్క స్వయంనిర్ణయ సూత్రంప్రకారం స్వతంత్రముస్లిం రాజ్యాలు స్థాపింపబడకుండా ఉంటే బాగుండునదే ధోరణిలో ప్రకటనలు చేస్తున్నారు. ఇదిసరికాదు. ఒకేభూభాగంలో అత్యధిక సంఖ్యాకులుగా నివసించే ప్రతిజాతి ప్రజలు స్వయంనిర్ణయ సూత్రం ప్రకారం వేరుగానివసించడానికి సహితం హక్కు కలిగియుండాలి. అది న్యాయమైన ప్రజాస్వామికహక్కు: కాబట్టి గాంధీజీ-జిన్నాలిద్దరూ ఎట్టి ఒడంబడిక చేసుకున్నప్పటికీ, దేశం దాన్ని ఐక్యకంఠంతో ఆమోదించాలి.

ప్రశ్న : అయితే వేవెల్ ప్రభువు యిచ్చిన మొండిసమాధానానికి మీరేమి చెబుతరు?

జవాబు : గాంధీజీ-జిన్నాల మధ్య ఒడంబడిక కుదిరిన వెంటనే వేవెల్ హృదయం మారిపోతుందని గాని, అద్భుత సంఘటలేవేవో జరుగుతాయనిగాని, నేను విశ్వసించను. తప్పకుండా మైస్రాయి ఇంకా ఎన్నో అడ్డంకులు పెడతాడు. అయితే, ఒడంబడిక కుదిరితే, ప్రపంచప్రజాభిప్రాయాన్ని మనవైపుకు యింకా బాగా తెచ్చుకోవచ్చు. అప్పుడు అంతా కలిసి సామ్రాజ్యవాదుల్ని లొంగతీయగల్గుతాం.

ప్రశ్న: యూరపుయుద్ధంలో సామ్రాజ్యవాదులు బలపడుతున్నారని మీ అభిప్రాయమా ?

జవాబు : ఈరోజున చర్చిల్ ప్రధాని ఫాసిస్టు వ్యతిరేక కూటమిలో ఉన్నప్పటికీ, విజయం మాత్రం అతనిదికాదు; యూరపియన్ ప్రజల్ది. యుద్ధానంతరం యూరపులో సామ్రాజ్యవాదులు తమ పలుకుబడిని తిరిగి స్థాపించుకోవడమనేది వట్టికల్ల. యూరప్‌లోనేగాదు; ఇంగ్లండ్‌లో సహితం పెత్తనం సామ్రాజ్యవాదుల చేతుల్లో ఉండదు.

ప్రశ్న : ఎందువల్ల ?

జవాబు : యుద్ధంలో శిథిలమైన ఆర్థిక నిర్మాణాన్ని తిరిగి బాగుపరచాలంటే, ప్రజల సహకారం తప్పనిసరిగా తీసుకోవలసివుంటుంది. అందువల్లకొత్తమంత్రివర్గంలో యిప్పటికంటే ఎక్కువగా ప్రజా ప్రాతినిధ్యం ఉంటుంది. ప్రజాస్వామ్య పద్ధతులు అమల్లోకి వస్తాయి. సోషలిస్టు సూత్రాలుకూడా కొంతవరకు ఆచరణలోకి వస్తాయి. సామ్రాజ్యవాదం నేడు శిథిలమవుతోంది: సోషలిస్టు సిద్ధాంతాల ప్రాబల్యం తప్పనిసరిగా ఎక్కువౌతుంది. అంతిమదశలో వున్న సామ్రాజ్యవాద ప్రభుత్వాలు యీ ప్రజావెల్లువను ఆపజాలవు.

★

జైల్లో ఆంధ్ర కాంగ్రెస్ నాయకుల ఉత్సాహం

శ్రీ పోతిన గణపతిరావు పాత్రుడు గారు వెల్లూరు సెంట్రల్ జైలులో డిటెన్యూగా ఉంటూ, అనారోగ్య కారణాలవల్ల గతమాసం 17 వ తేదీని 2 నెలల పెరోల్‌పైవిడుదలయి వచ్చారు. వారినిరాజాజీ ప్రణాళికను గురించి, గాంధీ - జిన్నా సంప్రదింపుల్ని గురించి, మన రాష్ట్రనాయకులు ఏమనుకొంటున్నారని ప్రశ్నించాను. వారిలా జవాబుచెప్పారు :

"ఏఒకరిద్దరో తప్ప. మిగతా నాయకులంతా సంప్రతింపులు ఫలించాలని కోరుతున్నారు; త్వరలో రాజీజరుగుతుందని ఆశిస్తున్నారు. గాంధీజీ - జిన్నాల మధ్య ఒడంబడిక కుదిరిననాడు రాజకీయ ప్రతిష్టంభనను అంతం చేయడానికి ప్రయత్నాలు జరుగుతాయి."

ప్రశ్న : గాంధీజీకి వేవెల్‌యిచ్చిన సమాధానాన్ని గురించి మీరేమంటారు ?

జవాబు : అనడానికేముంది ? అధికారాన్ని భారతీయుల హస్తగతం చేయడానికి వీల్లేదని స్పష్టంగా తెలియజేశాడు.

ప్రశ్న : ఐతే గాంధీ-జిన్నాలమధ్య ఒడంబడిక కుదిరినప్పటికీ, ప్రయోజనం ఉండదంటారా ?

జవాబు : ప్రయోజనం ఉండదని నేననను. ఐక్యతవల్ల మన బలం అనేక రెట్లు హెచ్చుతుంది. జాతీయప్రభుత్వం కొరకు భారతీయులందరినీ పూర్వంకంటే చక్కగా సమీకరించ గలుగుతాం.

శ్రీ గణపతిరావు పాత్రుడుగారు 1920 నుంచీ కాంగ్రెసు పోరాటాలలో పాల్గొంటూ, బెజవాడలో ప్రముఖపాత్ర వహిస్తూవచ్చారు. జిల్లాకాంగ్రెసు కమిటీలో సభ్యులు. బెజవాడ పురపాలకసంఘానికి మాజీ ఉపాధ్యక్షులు. జైల్లోశరీరమంతా చర్మవ్యాధి వ్యాపించి బాధపడ్డారు. ఇప్పుడుకూడా ఎక్కడికీ కదలలేని స్థితిలో ఉన్నారు.

★

కృష్ణాజిల్లా ముస్లింలీగ్ అధ్యక్షుని అభిభాషణ

గాంధీ - జిన్నా సంప్రతింపుల్ని గురించి ముస్లింలీగ్ నాయకుల అభిప్రాయా లెలా వున్నాయోనని తెలుసుకోడానికి యీ నెల 1 వ తేదీని కృష్ణాజిల్లా ముస్లింలీగ్ అధ్యక్షులైన మహమ్మద్ గులాంమొహద్దీన్ సాహెబ్ (జాగీర్దార్) గారిని కలుసుకున్నాను. రాజాజీ ప్రణాళికవల్ల ముస్లింలీగ్ కోర్కె యీడేరదని వారి అభిప్రాయం. ముస్లిం ప్రజలు మెజారిటీలోవున్న ప్రాంతాలలోవారు స్వతంత్రంగా జీవించే హక్కును మొదట ఎట్టి షరతులు లేకుండా. గుర్తిస్తేగాని ముస్లింలు సంతృప్తి చెందరన్నారు. కాని. గాంధీజీ - జిన్నా సాహెబ్‌ల మధ్య ఒడంబడిక కుదిరితే, దేశంలో శాంతి-భద్రతలు ఏర్పడతాయన్నారు. వారు యీ క్రింది విధంగా తెలియజేశారు.

"పాకిస్తాన్ అంటే భారతదేశంలో నివసించే అల్పసంఖ్యాకుల ప్రజలంతా - వారు ముస్లింలయినా, శిక్కులయినా, హిందువులైనా. క్రైస్తవులైనా ఎవరైనా సరే, శాంతి భద్రతలతో నివసించడానికి ఒకవిధమైన రక్షణ. అట్టి పాకిస్తాన్ సూత్రంపై ఆధారపడు ఒడంబడిక గాంధీ - జిన్నాగారల మధ్య కుదిరితే, ఒకజాతి ప్రజలకూ, మరొకజాతి ప్రజలకూ మధ్య యిప్పుడున్న భయాలు, అనుమానాలు. పూర్తిగా తొలగిపోతాయి. అప్పుడు యితరులెవరూ వివిధజాతుల మధ్య కలతలు, కలహాలు రెచ్చగొట్టడం సాధ్యపడదు."

★

పంజాబ్ నాయకుల పిలుపు

కాంగ్రెసు - లీగ్ ఒడంబడిక గూర్చి 38 గురు పంజాబ్‌రాష్ట్ర కాంగ్రెసునాయకులు, కమ్యూనిస్టులు కలిసి క్రిందిసంయుక్తప్రకటన గావిస్తున్నారు.

"మన రాష్ట్రంలోని అభివృద్ధి విరోధకులంతా కలిసి ఒడంబడిక జరగకుండా చేయడానికి తీవ్రప్రయత్నం చేస్తున్నారు. నేటి పరిస్థితుల్లో ఒడంబడికను వ్యతిరేకించడం అంటే అర్థం, చర్చిల్ - అమెరీముతా వర్గంలో పద్దం అన్నమాట; అంతే కాని దేశానికి సేవ చేయడం కాదు. కాంగ్రెసువాదులు తమకు స్వేచ్ఛ వున్నంతవరకు, స్థానికంగా ఐక్య సమావేశాలు, తీర్మానాలు, గావించి, మహాత్మునికి బలిగ్రాంటు పంపవలసిందని మేము కోరుకున్నాం. ఇది కాంగ్రెసువాదు లందరి యొక్క దేశభక్తియుతమైన కర్తవ్యం.

ఈసంప్రతింపులు ఫలించినప్పుడే రాజకీయ ప్రతిష్టంభన అంతమొంది. జాతీయప్రభుత్వం స్థాపింపబడగలదు. జాతీయప్రభుత్వం ఏర్పడినప్పుడే మనం మనప్రజల్ని ఆకలిబాధనుండి, కరువురాక్షసినుండి, విదేశీదురాక్రమణనుండి రక్షించుకొనగల్గుతాం. ఒడంబడిక ద్వారానే మనం స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొనగల్గుతాం. కాబట్టి, మహాత్ముని ప్రయత్నాలకు పూర్తిగా బలంచేకూర్చడానికి మనం సర్వవిధాల కృషిచేయాలి. మన మాతృదేశంపట్ల మనం నిర్వహించవలసిన కర్తవ్యం నేడు యిదే."

ప్రజాశక్తి

బుధవారం 6-9-44

ఆంధ్రకాంగ్రెసువాదులకు విజ్ఞప్తి

నేడు బీహారు రాష్ట్రంలో అంటువ్యాధులు తీవ్రంగా వ్యాపించాయి. మలేరియా, కలరా జాడ్యాలు రాష్ట్రంలో 4 వ వంతు వ్యాప్తిచెందాయి. కోటిపైగా ప్రజలకు యీ ప్రమాదం ఏర్పడింది. ప్రభుత్వ లెక్కలప్రకారం వారానికి 1500 ప్రజల ప్రాణాలు ఆహుతి అవుతున్నాయి.

ఈ పరిస్థితులు దేశభక్తుల హృదయాలను కలచివేశాయి. అన్ని రాజకీయపార్టీలు కదిలాయి. కాంగ్రెసు, లీగ్, కమ్యూనిస్టుపార్టీ, హిందూమహాసభ వగైరా అన్నీకలిసి సంయుక్త సహాయ కమిటీని ఏర్పరచాయి. దానికి బీహారు ప్రజానాయకులైన రాజేన్‌బాబును అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో సభ్యులైన మాజీ కాంగ్రెసు మంత్రి అనుగ్రహ నారాయణసిన్హా "మన ప్రజలు చనిపోతూంటే చూస్తూ వూరోవ్చాలము" అని స్పష్టపరచారు. బయటవున్న కాంగ్రెసు నాయకులు యిలా చేస్తూంటే, జైలులోవున్న రాజేన్‌బాబు కూడ బీహారు భూకంపనిధిలో మిగిలిన లక్షరూపాయలను యిందుకు ఖర్చు పెట్టడానికి యివ్వమని వ్రాశారు.

ఈవిధంగా బీహారు కాంగ్రెసు నాయకులు ప్రజారక్షణకు పూనుకొని యావద్భారతదేశానికి ఆదర్శప్రాయులయ్యారు. దర్భాంగజిల్లా నాయకులైన సత్యనారాయణసిన్హాను నివారణకృషిలో పాల్గొనడానికి జైలునుండి విడిపించుకోగలిగారు. రాజేన్‌బాబు విడుదలకొరకు అన్ని పార్టీలు ఆందోళన చేస్తున్నాయి. దేశానికంతకు మార్గంచూపుతున్న బీహారు దేశభక్తులకు మా ధన్యవాదాలు.

గుజరాతులో వరదలు వచ్చి యీ సంవత్సరం పంటలు కొట్టుకు పోయాయి. వేలకొలది పశువులు నశించాయి. గుజరాతు దేశభక్తులు కూడ వరదలబాధానివారణకృషికి పూనుకున్నారు. తమ నాయకులైన వల్లభాయి, గోపాల్దేశాయి వగైరాలను వెంటనే విడుదల చేయాలని ఆందోళన ప్రారంభించారు. వరద బాధితులకు సహాయంచేయడంలో ప్రభుత్వం ప్రజాసహకారాన్ని సంపాదించాలి. అందుకొరకు వెంటనే వల్లభాయి వగైరా గుజరాతు ప్రజానాయకులను విడుదల చేయాలని మేము ప్రభుత్వాన్ని హెచ్చరించుతున్నాము.

బీహారు, గుజరాతు దేశభక్తులు తమ ప్రజలను రక్షించుకోడానికి నిర్వర్తిస్తున్న విద్యుక్తధర్మాన్ని గుర్తించవమని ఆంధ్ర దేశభక్తులకు విన్నవించుతున్నాము. ఆహారకమిటీలలో పనిచేయడం, కరువు నివారణకు పూనుకోడంవల్ల, ప్రభుత్వంతో కలసిపోవాలనివస్తుందని కొందరు కాంగ్రెసువాదులు అంటున్నారు. ప్రజా యిబ్బందులను తొలగించడానికి కృషిచేయడం 60 ఏండ్లనుంచి కాంగ్రెసు సాంప్రదాయంగా ఎంచబడుతోంది. గత యేనాడి దేశభక్తుడు రాయలసీమకరువు నివారణకు ఎంతో కృషిచేసి ప్రజల మెప్పుపొందారు. బాధపడుతున్నది మన సోదరప్రజలు. ప్రభుత్వ దయాదాక్షిణ్యాలకు పీడితప్రజలను వదలివేయకూడదు. అన్ని పార్టీలు పూనుకుంటే, ఎంతోసాయం చేయగలుగుతాము.

ఆంధ్రకాంగ్రెసు సోదరులంతా కాంగ్రెసు సాంప్రదాయాలను నిలపడానికి పూనుకుంటారని ఆశించుతూ మేమీ హెచ్చరిక చేస్తున్నాము. విశాఖజిల్లాలో మనప్రజలు అన్నంలేక మాడుతున్నారు. గుంటూరుజిల్లా పల్నాడు, వినుకొండ తాలూకాలలో, కృష్ణాలో తిరువూరు, నందిగామతాలూకాలలో అలాగే బాధపడుతున్నారు. ఆకలినోవులకు ఆహారంఅందజేయడం దేశభక్తులందరి కర్తవ్యంకాదా? అని కాంగ్రెసువాదులను వినయపూర్వకంగా ప్రశ్నించుతున్నాము. ఈ సమయంలో ఆహారసమస్యలోపనిచేస్తే ప్రభుత్వంతో సహకారం చేసినట్లేనని భీష్మించడం విద్యుక్తధర్మాన్ని విడిచిపెట్టడం కాదా? ఒకసారి హృదయంవిప్పి ఆలోచించండి? బీహారు కాంగ్రెసునాయకుల ప్రజాసేవను వీక్షించండి. ఆహారసమస్యా పరిష్కారానికి ముందంజవేయండి. జైలులోవున్న ప్రకాశం, గిరి, శీతారామశాస్త్రి, సంజీవరెడ్డి వగైరా కాంగ్రెసునాయకుల విడుదలకు ఆందోళన చేయడానికి పూనుకోండి.

★ మన రాజకీయాలు

వేవెల్ ముఠాప్లానును భగ్నమొనర్చడం ఎలా?

— కంభంపాటి సత్యనారాయణ

వైస్రాయి గాంధీజీకి యిచ్చిన జవాబులో యుద్ధానంతరం వరకు భారతీయులతో రాజీచేసుకొనే ఉద్దేశం తమకు లేదని స్పష్టంగా తెలిసిపోయింది. హిట్లరుపని కొద్దిరోజుల్లోనే పూర్తికాబోతూంది. ఈసంవత్సరమే యూరపులో యుద్ధం అంతమయేటట్లుంది. ఇట్టిసమయంలో రాజీ జరిగితే ఎక్కడ దేశంఅంతా ఐక్యమవుతుందో, ఎక్కడ మళ్లీ స్వాతంత్ర్య పోరాటం ప్రారంభమవుతుందో, అని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు భయపడుతున్నారు. మనదేశంలో జాతీయశక్తులు ఎంత ఎక్కువకాలం ఛిన్నాభిన్నమై యుంటాయో, యుద్ధానంతరంకూడా తమ పెత్తనాన్ని అంతసులభంగా నిలబెట్టుకో వచ్చునని వారి ఆశ.

ఇంగ్లండులో టోరీపార్టీ పత్రికలే కాకుండా, "మాంచెస్టర్ గార్డియన్" వంటి లిబరల్‌పార్టీ పత్రికలు సహితం వేవెల్ యిచ్చిన మొండి సమాధానాన్ని బలపరుస్తున్నాయి. గాంధీజీ సూచనలు ఏమాత్రం సహాయకారికావని "మాంచెస్టర్ గార్డియన్" వ్యాఖ్యానించింది.

ప్రపంచద్రవ్య మహాసభలో

అమెరికాలో యీ మధ్య జరిగిన "ప్రపంచద్రవ్య మహాసభ"కూడా యీ విషయాన్నే రుజువుచేసింది. మన దేశంలో రాజకీయ ప్రతిష్టంభన కొనసాగుతూన్నంత కాలం భారత దేశ ప్రతినిధులవల్ల, యుద్ధానంతర సమస్యల పరిష్కారం విషయంలో సామ్రాజ్యవాదులెంత తృణీకారభావం చూపుతారో ఆ సమావేశం రుజువుచేసింది. అందులో పాల్గొన్న భారతీయ ప్రతినిధులు యీ విషయాన్ని చక్కగా విశదపరచారు. చర్చల సందర్భంలో వారు రెండు ప్రతిపాదనలు ప్రవేశపెట్టారు. మొదటిది, భారతదేశంవంటి వెనుకబడ్డ దేశాలలో పారిశ్రామికాభివృద్ధికి అవకాశాలు కలుగజేయడం. రెండవది, యుద్ధం ప్రారంభమైననాటినుంచి నేటివరకు ఇంగ్లండ్‌లో పోగైన భారతదేశఋణం భారతదేశానికి తిరిగి చెల్లించేటట్లు హామీ యివ్వడం. ఈరెండు ప్రతిపాదనలను బ్రిటన్ అమెరికాలు, వాటి చలువుబడిలోవున్న కొన్ని అల్పమిత ప్రభుత్వాలు, వ్యతిరేకించాయి; అధిక సంఖ్యాకులచేతోసివేయబడ్డాయి.

కాబట్టి, యుద్ధం సాగుతూన్నంతకాలం మన దేశానికి స్వాతంత్ర్యం యివ్వకుండా ప్రతిష్టంభనను ఇలాగే కొనసాగించడం, యుద్ధం పూర్తిఅయాక ఆర్థికంగా మనమీద పెత్తనాన్ని యిప్పటిమాదిరిగానే చెలాయించడం — యిదీ వేవెల్‌ముఠాయొక్క ప్లాను.

బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ ప్రకటన

కాని, బ్రిటన్‌లోనూ, అమెరికాలోనూ, ప్రజాస్వామ్య శక్తులు యీ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయి. ఉదాహరణకు, బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ ఒక ప్రకటనగావించింది. అందులో యిలా ఉంది:

".....మిత్రరాజ్యాల విజయం సమీపిస్తూన్నకొద్దీ, కొత్త అవకాశాలెన్నో ప్రజలకు లభిస్తున్నాయి. ప్రజాస్వామిక దేశాలన్నింటిలోనూ ప్రజలశక్తి విజృంభిస్తోంది. సోవియట్ యూనియన్ యొక్క పలుకుబడి ప్రపంచమంతటా హెచ్చింది. వలసదేశాలలో ప్రజల స్వాతంత్ర్య పోరాటం కొత్తస్థాయికి అభివృద్ధి చెందుతూంది.

"అంతర్జాతీయంగా, నూతన ప్రపంచ వ్యవస్థ ఆర్థిక పునర్నిర్మాణంమీద, వలసదేశాల స్వాతంత్ర్యంమీద, ఆధారపడి వుంది. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధిస్తేగాని, ప్రపంచంలో సౌఖ్యం వుండదు. అప్పుడే ఆర్థిక సంక్షోభాలు తిరిగి తలయెత్తకుండా ఉంటాయి. యుద్ధానంతర పునర్నిర్మాణం విషయంలో భారతదేశంకూడా ఉచితస్థానాన్ని అలంకరించాలి."

ఈవిధంగా బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ యుద్ధానంతరం కూడా సామ్రాజ్యవాదులు ఇండియావంటి వలసదేశాలపై తమ పెత్తనాన్ని సుస్థిరం చేసుకోడానికి గావించే కుట్రలను భగ్నపరచ నిశ్చయించింది. మిత్ర రాజ్యాలన్నీ కలిసి సంయుక్తవ్యూహంతో నేడు హిట్లరుమీద ఆఖరుదెబ్బ తీస్తున్నాయి. విజయం కనుచూపుమేరలో వుంది. ఇంగ్లండులో పార్లమెంటు ఎన్నికలకు ఏ నిమిషంలోనైనా నోటీసు యివ్వబడవచ్చు. ఈ పరిస్థితుల్లో బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ వై ప్రకటనను గావించడం, లేబరుపార్టీ సహకారంకోసం తిరిగి తీవ్రంగా ప్రయత్నాలు ప్రారంభించడం, భారతదేశంలో వున్న మనకు మంచి అవకాశాలిస్తున్నాయి. లేబర్‌పార్టీకి, కమ్యూనిస్టుపార్టీకి, మధ్య ఒడంబడిక జరగాలని బ్రిటిష్ కార్మిక ప్రజాసామాన్యం ఎంతో ఆందోళన చేస్తూంది. మన దేశంలో కాంగ్రెసుకూ-ముస్లింలీగ్‌కూ మధ్య ఒడంబడిక జరిగితే మన జాతీయోద్యమచరిత్రలో ఒక నూతనశకం ఎలా ప్రారంభమవుతుందో, అలాగే బ్రిటన్‌లో లేబర్-కమ్యూనిస్టుపార్టీల మధ్య ఐక్యత బ్రిటిష్ సామ్రాజ్యవాదుల్ని లొంగదీయడాని కెంతైనా తోడ్పడుతుంది.

ఫిలిప్సు ఉదంతం

ఫిలిప్సు అమెరికన్ అధ్యక్షుని రాయబారిగా మనదేశానికి వచ్చి, ఇక్కడి రాజకీయ ప్రతిష్టంభనవల్ల యుద్ధకృషికి ఎలా హాని జరుగుతుందో వివరిస్తూ యిచ్చిన రిపోర్టు పాఠకులకు తెలిసిన విషయమే. ఈ రిపోర్టు అమెరికా పత్రికలలో విరివిగా ప్రచారం అయింది. అందులో ఆతడి క్రిందివిధంగా తెలియజేశాడు:

"మాటలు యెన్నిచెప్పినా, ఉపయోగం ఉండదు. వాటివల్ల హాని మరింత యెక్కువౌతుంది. బ్రిటిష్‌వారు కార్యాచరణకు దిగడం అత్యవసరం. యుద్ధం ముగిసిన తరువాత కొంత స్పష్టమైన వ్యవధియిచ్చి, ఆ వ్యవధిలో భారతీయులకు సంపూర్ణ స్వాతంత్ర్యం లభిస్తుందని బ్రిటిష్ చక్రవర్తి ఒక ప్రకటన గావించవలసియుంది. అంతేకాదు. ఈలోగా కేంద్రంలో ప్రజాప్రతినిధులతో గూడిన ఒకతాత్కాలిక ప్రభుత్వాన్ని స్థాపించుతామనికూడా స్పష్టం చేయవలసి యుంది. దానికి కొన్ని అధికారాలైనా వెంటనే స్వాధీనం చేయవలసి యుంది.

కొద్దిరోజుల్లో అమెరికన్ పార్లమెంటు (హౌస్ ఆఫ్ రిప్రజంటేటివ్స్) సమావేశం కాబోతూంది. ఆసమావేశంలో ఒక రిపబ్లికన్‌పార్టీ ప్రతినిధి ఫిలిప్సు ఉదంతాన్నిగూర్చి ఒక తీర్మానం ప్రతిపాదించబోతున్నాడు. అందులో ఫిలిప్సు యిచ్చిన రిపోర్టును ఉదహరిస్తూ, బ్రిటిష్‌ప్రభుత్వం ఫిలిప్సుపై చర్యతీసుకున్నందుకు ఆ తీర్మానంలో గర్హించాడు. అమెరికాలో వున్నబ్రిటిష్ రాయబారిమీద, ఇండియాప్రభుత్వ ప్రతినిధిమీద కూడా అట్టి చర్యనే తీసుకోవాలని హెచ్చరించాడు.

అమెరికన్ ఎన్నికలు కొద్దిరోజుల్లో జరుగనున్నాయి. రూజువెల్టుకు వ్యతిరేకంగా తమ ప్రతినిధిని నెగ్గించుకోడానికి రిపబ్లికన్‌పార్టీ నాయకులు వేస్తున్నఎత్తులు తప్ప మరొకటి కాదు ఈతీర్మానం. పైకి ప్రజాస్వామిక సూత్రాలు వల్లిస్తూ, మరోవైపు ఫిలిప్సువంటివారిని ప్రోత్సహించిన రూజ్‌వెల్టును ఓడించి, ఫాసిస్టులతో రాజీపడాలనే పంథా వీరిది. అయినప్పటికీ, ఫిలిప్సు యిచ్చిన రిపోర్టు ప్రపంచానికంతకూ వెల్లడయింది. ఇండియావల్ల బ్రిటన్ అనుసరించవలసిన విధానం యెలా ఉండాలో అమెరికన్ అధ్యక్షుని ప్రతినిధి లోకానికి వెల్లడిచేశాడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలసీపై యిదొక బలీయమైన దెబ్బ.

కాంగ్రెసువాదుల వైఖరి

ఇట్టి అనుకూల వాతావరణంలో క్రిందటినెల 19వ తేదీని జరుగవలసిన గాంధీ-జిన్నా సమావేశం, జిన్నాగారి అనారోగ్యంవల్ల యీ నెల 9వ తేదీకి వాయిదా పడింది. ఈ 20 రోజుల వ్యవధిలో జైళ్ల బయటనున్న కాంగ్రెసువాదులు రాజాజీ ప్రణాళికను బలపరుస్తూ ప్రజల్లో విరివిగా ప్రచారం చేయడంగాని, హిందూమహాసభ నాయకుల వ్యతిరేక ప్రచారానికి జవాబు చెప్పడంగాని, ఎక్కువగా చేయలేదు. రాజాజీ ప్రణాళికను, గాంధీజీ నాయకత్వాన్ని, వారు అంగీకరిస్తూన్న మాట నిజమే. గాంధీ - జిన్నాల మధ్య సంప్రదింపులు సఫలం కావాలని వాంఛిస్తూన్న మాటకూడా నిజమే. కాని, హిందూమహాసభయొక్క దుష్ప్రచారంవల్ల వారు తటస్థ విధానం వహిస్తున్నారు. గాంధీజీని (మిగతా 6వ పేజీ)

ధరలకంట్రోలు అమలుజరుగక పల్నాడుప్రజలు పడుతున్నపాట్లు

— ఎం. పద్మనాభం

పల్నాడుతాలూకా (గుంటూరుజిల్లా)లో కరువు పరిస్థితులు ప్రజలనెంతో కలవరపెడుతున్నాయి. కరువుతో అలమటిస్తున్న ప్రజల్ని దొంగవ్యాపారులు పీల్చి పిప్పిచేస్తున్నారు. మే నెలలో రూపాయికి మానెడు నోటెడుబియ్యం అమ్మారు. బస్తావెల రు 51 లకు పెరిగింది. దానితో కంట్రోలుకోసం ప్రజల ఆందోళన మిన్నుముట్టింది. ప్రభుత్వం కూడా తగిన చర్యలు తీసుకొంది. తహసీల్దారు వచ్చిన బియ్యాన్ని వచ్చినట్లు సీలుచేశారు. దీనిని ప్రజలకు పంచడానికి కొంపరసేషనింగు ఏర్పాటుచేశారు. జూన్ నెలకుగాని ఇదిఅచరణలోకిరాలేదు. వచ్చినా, సవ్యంగా సాగలేదు. రోజుకు, మనిషికి పిడుగురాళ్ల దుర్గి, కారంపూడి, జూలకల్లు గ్రామాలలో 2 గిద్దలు; దాచేపల్లిలో 4 గిద్దలు; గురజాలలో 5½ గిద్దలు - మాచర్లలో 5 గిద్దలు - ఈవిధంగా ఒక్కొక్కచోట ఒక్కొక్క విధంగా రేషనింగు అమలు జరుపుకున్నారు. ఇంతేకాకుండా, రేషన్‌బియ్యం ప్రజలకు సరిగాఅందడంలేదు. గురజాలలో ఒకేఒక షాహుకారు బియ్యం తెప్పిస్తున్నారు. చాలినంత తెప్పించరు. అందువల్ల తహసీల్దారు మాచర్లనుంచి బియ్యం తెప్పించి, అమ్మిస్తున్నారు. అందువల్ల మాచర్లలో, గురజాలలోకూడ ఇబ్బంది గాఉంది. దాచేపల్లి, కారంపూడి మొదలయిన ప్రదేశాల్లోకూడా బియ్యంసరిగా అందడంలేదు. ప్రజలు చాల అవస్థ పడుతున్నారు. జూన్ నెలాఖరు పరిస్థితులివి.

అధికారుల ఆహారకమిటీలు

ఈ పరిస్థితులను సరిదిద్దాలని ప్రజల్లో విపరీతంగాఆందోళనజరిగింది. ప్రభుత్వంకూడ కదిలింది. గ్రామగ్రామాన ఆహారకమిటీలు పెట్టారు. అందులో ఒక షాహుకారుని డీలరుగా ఏర్పాటుచేశారు. నెలకు గ్రామానికి 6 బస్తాలు సప్లయి ఏర్పాటుచేశారు. కాని ఇది అన్నిచోట్ల జరుగలేదు. గురజాల, మాచర్ల, దాచేపల్లి పిడుగురాళ్ళ పిర్కాల్లో మాత్రం జరిగింది. ఆ ప్రదేశాల్లోనయినా, యీ కమిటీలు ప్రజా ఆహారకమిటీలు కాకపోవడంవలనప్రజలకంతగా సౌకర్యంజరగకపోయింది. కమిటీబాధ్యుల బంధుమిత్రులకు మాత్రం లాభకరంగాఉంది. ప్రజలు గింజలకోసం దేవులాడుతూ, బస్తీలకు ప్రయాణమవుతున్నారు. కాని అక్కడి పొరుగూళ్ళనుండి వచ్చేవారికి బియ్యం ఇవ్వడం మానివేశారు. 14 మైళ్ళ దూరంనుంచి కూడా నడిచివచ్చి ఉత్తచేతుల్తో తిరిగి వెళ్లినవారెందరో ఉన్నారు. మాచర్లలో మాత్రం రోజుకు 25 మందికి ఒకటి-రెండు రూపాయలబియ్యం ఇస్తున్నారు.

ఇక రేట్లసంగతి చూద్దాం. జిల్లాకలక్టరు నిర్ణయించిన రేటుప్రకారం పల్నాడులో బస్తా బియ్యంధర రు 25-15-0. విడిగా రు 1-0-4 కు రెండు మానికలు. ఈ రేటున అమ్మితే షాహుకార్లకు లాభం ఉండదనిచెప్పి, అధికార ఆహారకమిటీలు రు. 1-1-0 కు 2 మానికలు అమ్మడం ప్రారంభించాయి. గురజాలలో రు. 1-1-9 కి రెండుమానికలు కూడా అమ్ముతున్నారు. ఈ ధరే ఇక అన్ని ప్రాంతాలకు ప్రామాణికం మొదలైంది.

క్షామనివారణ కమిటీకృషి

దీని నరికట్టడానికి తాలూకా క్షామనివారణ కమిటీ, తాలూకా రైతుసంఘం పూనుకున్నాయి. ధరల పెరుగుదలను గురించి జిల్లా కలెక్టరుకి, డిప్యూటి కలెక్టరుకు టెలిగ్రాములిచ్చారు. తాలూకా రైతుసంఘబాధ్యుడు జిల్లా సంగతులన్నీవిని, జిల్లా కలెక్టరుచేత రు. 1-0-4 కు రెండు మానికలు అమ్మేటట్లు ఆర్డరు ప్యాస్ చేయించారు. ఈ రేటుకి మాచర్లలో మాత్రం 4 రోజులు అమ్మారు. నష్టంవస్తుందని షాహుకార్లు గోలచేశారు. అధికార ఆహారకమిటీలు ఎప్పటిలాగానే రు. 1-1-0 రేటుకి అమ్మించాయి. దాచేపల్లిలో అసలు వర్తకులు బియ్యం తేవడమే మానివేశారు. అక్కడి ప్రజలు 14 రోజులు కంది గుగ్గిళ్ళు తినవలసిన గతి పట్టింది. దానితో రోగాలు వ్యాపించాయి. వెంటనే తాలూకా రైతుసంఘ కార్యదర్శి, ఈ విషయాన్ని తహసీల్దారుతో చెప్పారు. మాచర్లనుంచి 30 బస్తాల బియ్యం, 48 బస్తాల జొన్నలు తెప్పించి దాచేపల్లి ప్రజలకు అమ్మించారు. ఇంతలో ఆగ్రామానికి బియ్యం సప్లయి వచ్చింది

డిప్యుటేషన్ల ఫలితం

గతమాసం 8 వ తేదీని జిల్లాకలెక్టరు, డిప్యూటీకలెక్టరు పొందుగులగ్రామంవచ్చారు. దారిలో పిడుగురాళ్ళలో ఆహారకమిటీవారు 400 మంది ప్రజలతో డిప్యుటేషన్ తీసుకువెళ్ళారు. రు 1-1-9 రేటు రద్దుచేయాలని; రెండు గిద్దలరేషన్ సరిపోవడంలేదు కాబట్టి పెంచాలనీ, లైసెన్సుదారులసంఖ్య పెంచాలనీ కోరారు. ఈకోర్కెలను గురించి కలక్టరు ఆలోచించిరు. 1-1-9రేటుకుఅమ్మినవారి పర్మిట్లు వెంటనే రద్దుచేయించారు. కొత్తవారికిపర్మిట్లిచ్చారు. రు. 0-15-8 కు రెండు మానికలు అమ్మాలని ఉత్తరువుచేశారు.

పొందుగులలో తాలూకా క్షామనివారణ సంఘ, రైతుసంఘ కార్యదర్శులు జిల్లాకలక్టరు, డిప్యూటీ కలక్టర్లను కలుసుకోడానికి వెళ్లాము. అప్పటికప్పుడే పొందుగుల, రామాపురం గ్రామ రైతు,లు కూలీలు వేయిమంది వరకూ డిప్యూటేషన్ వచ్చి ఉన్నారు. ఆ రెండు గ్రామాలకు కలిపి ప్రత్యేక లైసెన్సు ఇవ్వాలనీ, దాచేపల్లినుంచి వచ్చేకోటా 6 బస్తాలు కంట్రోలు రేటుకే ఇప్పించాలనీ, రెండు గ్రామాల్లోను రైతులనుండి ధాన్యం కమాండీరుచేసి బీదలకు అమ్మించాలనీ ఆ రెండు గ్రామాలవారు కోరారు. ఈ కోరికలన్నిటిని నెరవేర్చడానికి కలక్టరుగారు అంగీకరించారు. డిప్యూటీకలక్టరు ఆ సాయంత్రం ఊళ్లోతిరిగి 50 బస్తాల ధాన్యం కమాండీరుచేసి, రూపాయికి పెద్దమానికతో 3మానికలు చొప్పున అమ్మించారు.

తుంటరిపనుల ఖండన

పల్నాడు తాలూకా కాంగ్రెసు ప్రముఖులున్నూ, తాలూకా కరువునివారణ కమిటీ అధ్యక్షులున్నూ అయిన శ్రీ నాళం మట్టపల్లిగారు యీ ప్రకటన యిచ్చారు:

నేనున్ను, తాలూకాలో మరికొందరున్ను, కమ్యూనిస్టుపార్టీవారున్నూ కలసి పల్నాడు తాలూకా కరువునివారణ కమిటీ ఏర్పరచిన లగాయతు ఆహారసమస్యా పరిష్కారమునకు కృషిచేయుచున్నాము. ఈ సంగతి తాలూకా స్థానికాధికారులకున్నూ, జిల్లాఅధికారులకున్నూ పూర్తిగా తెలిసినవిషయమై యున్నది.

1. గురజాలలో జాతీయైక్యతా వారములో శ్రీకాశీవర్ధ్ధ శేషయ్యగారి అధ్యక్షతను జరిగిన సభను గంగవరం కాపురస్తుడు పుల్లప్ప నాయుడు వగైరాలు అల్లరిచేసినారు.

2. 24 వ తేదీ మా కార్యదర్శి అయిన సుబ్బారావుగారిని కొట్టుటకు సిద్ధపడినారట.

3. 25 వ తారీఖున పార్టీఆఫీసుపైకివచ్చి వర్కర్లను దుర్భాషలాడి చెప్పులు విసిరారట.

ఈసంఘటనలు వినగానే నాకు చాల విచారము కలిగినది.

ఇటువంటి తుంటరిపనులను గర్హించుచున్నాను.

దాచేపల్లిలో శ్రీ కోలా సుబ్బారెడ్డిగారిని, మరికొందరిని కలుసుకొని సెప్టెంబరు 15 వ తారీఖున నడికూడి రైల్వేస్టేషను విధ్వంసము చేయుటకు సమకట్టినట్లుగా రైల్వేవారు అకారణమున్న అర్జీలు, పెడలేకుండా వదంతులు వంపుటయు, దానిమీద అధికారులు అనవసర ఆందోళన పడుచున్నట్లు తెలియుచున్నది కాని నాకు తెలిసినంతవరకు శ్రీ సుబ్బారెడ్డిగారుగాని, యితర కమ్యూనిస్టులు గాని విధ్వంసకచర్యలకు పూనుకొనరని నమ్ముచున్నాను. వీరు దేశరక్షణకు, ప్రజాక్షేమమునకు విధ్వంసకచర్యలు అనర్థమని సభాసమావేశాలద్వారా ప్రచారంచేయుచున్నారు.

ఇటువంటి రాజకీయ ప్రచారములకు తుంటరిపనులు జరుగకుండా ప్రజాశ్రేయోభిలాషులందరు చూడవలసిన విధిమైయున్నది.

రెంటచింతల, 28—8—44 ఇట్లు, నాళం మట్టపల్లి

మెట్టధాన్య సేకరణ విషయంలో ఆత్మకూరురైతుల మొర

మెట్టధాన్య సేకరణకు ప్రభుత్వం ఒక స్కీము ప్రకటించింది. ప్రవాహాల్లో పైర్లు పోయినా; చీడపట్టి పంటచెడిపోయినా, వాటికి వసూలు చేయరాదనీ, మిగతా వసూలు చేసిన ధాన్యాన్ని స్థానిక ప్రజలకు అవసరమైతే అక్కడే కంట్రోలు ధరలకు అమ్మాలనీ నెల్లూరు జిల్లా రైతుసంఘం, ఆత్మకూరు తాలూకా రైతుసంఘం ఆందోళన చేశాయి. అవసరమయితే స్థానికంగానే అమ్మిస్తామనే దానికి అధికారులు అంగీకరించారు. కాని, చెడిపోయిన పైర్లవిషయంలో వారు సానుభూతితో ప్రవర్తించడంలేదు. ధాన్యసేకరణ స్కీము ప్రాముఖ్యాన్ని నచ్చచెప్పక, నిర్బంధానికి పూనుకుంటున్నారు. దీనివల్ల ప్రజల్లో స్కీముపట్ల విముఖత ఏర్పడుతూంది. ఉదాహరణకు తూర్పు కంభంపాడు (ఆత్మకూరు తాలూకా, నెల్లూరుజిల్లా)లో రాగి, సజ్జ పండలేదు. ప్రభుత్వం ఆపైర్లకు రెమిషన్‌కూడా ఇచ్చింది. కాని ఈ పైర్లకు కూడా వసూలుచేయ సమకట్టారు రెవిన్యూ ఇన్‌స్పెక్టరు. పోయిన పైర్లకు యివ్వలేమనీ, పండిన పైర్లకు యిస్తామనీ రైతులు మొరపెట్టుకున్నారు. దానిపై రైతులమీద కేసు పెట్టడానికికూడ పూనుకున్నారు. ఆత్మకూరు తాలూకా రైతుసంఘం ఈ విషయాన్నంతా తహసీల్‌దారుకి వివరించి, కేసును కొట్టివేయవలసిందనీ, పండిన్న పంటకు మాత్రమే వసూలుచేయాలని కోరారు.

నిరంకుశంగా ప్రవర్తించడంవల్ల ధాన్యసేకరణ స్కీముపట్ల ప్రజలకెంత విముఖత ఏర్పడుతుందో, తద్వారా ఎంతనష్టం కలుగుతుందో అధికారులు గుర్తించాలి. ప్రజలసానుభూతి సహకారాలనుపొంది, స్కీమును జయప్రదంగా కొనసాగించడానికి కృషిచేయాలి.

అధికారుల ప్రవర్తనకు కినిసి రైతులు ప్రభుత్వ ధాన్యసేకరణ నోటీసులను నిరాకరించకూడదు. అలా నిరాకరించడం చట్టరీత్యా నేరమౌతుంది. నోటీసులను తీసుకొని, అవెలా అక్రమమో ఆందోళనచేసి, అన్యాయము జరక్కుండా చూచుకోవాలి.

తాలూకాబాధ్యులు జిల్లాకలక్టరుని, డిప్యూటీకలక్టరుని కలుసుకొని తాలూకాలో ఇంకా ఎక్కువ పర్మిట్లు ఇవ్వాలని, క్షామనివారణ కమిటీ ప్రోగుచేసిన 8 వేల రూపాయలకు తొందరలో ధాన్యం వచ్చే ఏర్పాటుచేయాలని, తాలూకాలో ఏర్పాటుచేసిన ఆహారకమిటీలలో ప్రజా ప్రతినిధులకు స్థానం ఇవ్వాలనీ, మాచర్ల భిక్షపతి సాగిస్తున్న దొంగవ్యాపారాన్ని అరికట్టాలని, తాలూకాకు రాజమండ్రి, ఏలూరునుంచి జొన్నలు ఎక్కువగా తెప్పించే ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు ఈ ఏర్పాట్లు చేస్తామని వాగ్దానం చేశారు. ప్రజా సంస్థల సహకారంతో అధికారులు ఈ ఏర్పాట్లుచేసి, పల్నాడును క్షామదేవత బారినుండి కాపాడాలి.

గమనిక!

10—9—44 ఆదివారం

ఉదయం గం 9 లకు

ఆంధ్రరాష్ట్ర ప్రెస్‌వర్కర్సుయూనియన్ వర్కింగుకమిటీ సమావేశం, తెనాలి బ్రాంచి యూనియన్ ఆఫీసులో జరుగును. గాన అన్ని బ్రాంచీల వర్కింగుకమిటీ సభ్యులు తప్పక దయచేయవలెను.

యల్. కోగారావు,
ప్రధాన కార్యదర్శి

గుంటూరుజిల్లాలో ఆహారపరిస్థితి విషమించింది!

గుంటూరు జిల్లాలో యీనాటి ఆహార పరిస్థితిని గమనించిన ప్రతివారికి వేలకొలది మెట్ట తాలూకా రైతు, కూలీల స్థితిగతులు ఎంతటి ప్రమాదానికి దారితీస్తున్నది నిశదమవు తుంది. తోటా అధికారుల ఆఫీసులవద్ద, తోటు వ్యాపారుల కొట్లవద్ద గుమిగూడే వారిని చూచినవారందరూ అంతోయితో అదనంగా వండే యీరోజుల్లోకూడా యింతటి విషాద దృశ్యాలను నిత్యమం చూడవలసి ఎందు వచ్చిందా అని ఆశ్చర్యపడకమానరు. మెట్ట ప్రాంతాల పల్లెపట్టుల్లో నిత్యం అర్ధాకలితో గడిపే కూలీలను చూస్తే కడుపు తరుక్కు పోతుంది.

విషమ పరిస్థితులకు కారణం

ఇంతటి ఆందోళనకర పరిస్థితులేర్పడ్డానికి ప్రధానకారణాలు ప్రభుత్వ ధాన్య సేకరణవిధానమూ, కంట్రోలును వ్యతిరేకించి అన్యాయ లాభాలను గడించే వర్తకుల, మిల్లు యజమానుల చర్యలూను. జిల్లాలో మొత్తం 30 వేల టన్నుల బియ్యం అదనంగా పండుతుందనీ, మెట్ట ధాన్యాలు 28 వేల టన్నులు తరుగనీ; జిల్లాఅధికారుల అంచనా. ఇంతవరకు నాలుగువేల టన్నుల మెట్ట ధాన్యాలను దిగుమతిచేసి, 22 వేల టన్నుల బియ్యం ఎగుమతిచేయడం జరిగింది. ఉన్న అదనాన్ని బయటజిల్లాలకు పంపి సోదర మానవుల రక్షించుకోవడానికి ఏ ప్రజాపక్షపాతి అంగీకరించడు; కాని ఉన్న ధాన్యాన్ని సక్రమ వినియోగం చేయకపోవడం వల్లనే ప్రభుత్వ అసమర్థత వెల్లడికావడం, ప్రజలు అనేకలపాలుగావడం జరుగుతోంది. సక్రమ సప్లయి, పంపకాలను అనుసరిస్తే కొరతపడ్డ ఆరు మెట్ట తాలూకాలను పోషించుకోగలం.

ఏప్రియల్ మధ్యలో కంట్రోలు ప్రవేశ పెట్టారు. జిల్లాబయటకు పంపే బాధ్యత పర్చే జింగుఆఫీసరు; జిల్లాలో తరుగు ప్రాంతాలకు సరఫరా చేసే బాధ్యత జిల్లా కలెక్టరు తీసు కున్నారు. బయటికి పంపేదాన్ని అదరించో బెదరించో తీసుకుపోతున్నారుగాని, మెట్ట తాలూకాలకు జరగవలసిన సరఫరా మాత్రం కుంటుబడుతోంది. మొదట్లోనే యీ కంట్రో లుకు వ్యతిరేకంగా మిల్లులన్నీ మూసేసి, ఆహార కొరతను తీవ్రంచేయ పూనుకు న్నారు వాటి యజమానులు. అదివరకు రు 12-8-0 చొప్పున వడ్లబస్తాలను మిల్లుకు తోలారు. 11-1-0 గా కంట్రోలుచేయడంతో మాగాణిరైతుకూడ వెంటనే విడుదల చేయ లేదు. కంట్రోలువ్యతిరేకించే వ్యాపారులకు యీస్థితి అనుకూలించింది. వెంటనే హెచ్చు ధరల ఆశచూపి, అసలే విడుదల కానీక పోవడం; హెచ్చుధరలకు కొన్నధాన్యాన్ని వివరీత ధరలకు దొంగ మార్కెట్టులో అమ్మడం, ఆరంభించినారు. మిల్లువద్దకు మెట్టతాలూకాల నుండి పర్మిట్లతో వచ్చిన వర్తకులకు రూ. 2 అదనంగా యిస్తేనేగాని మిల్లు అధికారి బియ్యం ఇవ్వడు; కంట్రోలు రేటుకే యిమ్మంటే పర్చేజింగు ఆఫీసరు 'కాంట్రాక్టు చూపి,తనవద్ద అసలే లేదంటాడు. అలా అధిక ధరలకు కొన్న వ్యాపారి మెట్టగ్రామాల్లో ఇంకా అధికధరలకు అమ్ము తున్నాడు. దీనికితోడు లంచగొండులైన దొంగ వ్యాపారులతో రాజీపడిన అధికారుల చర్యలు మరింత నిక్రృష్టస్థితికి ప్రజలను యీడ్చాయి. ప్రస్తుతం మెట్టప్రాంతాల్లో బస్తా బియ్యం రు 40 లు నుంచి రు 50 లు వరకు అమ్ము తుండడమే పై విషయాన్ని రుజువుచేస్తుంది.

జోనల్ స్కీము

దొంగవ్యాపారంవల్ల సరఫరా సరిగా జరగడం లేదని జిల్లాకలెక్టరు వ్యాపారం మీదకూడ కంట్రోలు వహించడానికి "జోనల్ స్కీమును" ప్రవేశపెట్టారు. దీని ప్రకారం ప్రతిమిల్లు పనిచేసే శక్తినిబట్టి ఆ మిల్లుకు కొన్ని మాగాణిగ్రామాలు నిర్ణయించి, ఆ మిల్లు ఆడిన బియ్యం మరికొన్ని మెట్ట గ్రామాలకు సప్లయి చేయాలి పర్మిట్లుపొం దినవర్తకులేవ్యాపారం చేయాలనడంవల్ల విచ్చ లవిడిగా కొని, దొంగమార్కెట్టును పెంచే అవకాశం పోయింది. ఈ స్థితిని ఒకగ్రామం నుండి మరొక గ్రామానికి పర్మిటులేనిదే ధాన్యం సరఫరా చేయరాదనే నిబంధన మరింత కట్టుదిట్టం చేసింది. ఈ స్కీములోని ప్రధానసూత్రం మంచిదే అయినా, ఈ అవ కాశం తీసుకొని స్థానికాధికారులు కొందరు యుద్ధబాండ్లను కొనమని రైతులను నిర్బం ధించడం, స్కీముతోబాటు రైతుకు యింటి వద్ద వడ్లధర రు. 11 లుగా నిర్ణయించక పోవడంవల్ల ఆయాప్రాంతాల్లోని స్వార్థపరులు, దొంగవ్యాపారులు అసలు కంట్రోలే అవసరం లేదని ప్రచారం చేశారు. విపరీతంగా వ్యతి రేక ప్రచారం స్వార్థపరులు చేస్తుంటే, దొంగ వ్యాపారులు ఆశోనులో ధాన్యం తమ తెలాగూ వస్తుందని అనలుకొనక, "మీరు కమాండీరు చేయండి - మేం మిల్లువేస్తాం" అని కొర తను మరింత పెంచసాగారు; రైతులు అమ్మటకు త్వరపడితే, కంట్రోలుకంటె తగ్గు ధర యిస్తామన్నారు. పైగా దగ్గరమిల్లు వుండగానే కొన్ని మిగులుగ్రామాలను దూరపు మిల్లుకు వేయడంజరిగింది. పర్చేజింగు ఆఫీ సరుకూడ తామబయటకుపంపే సప్లయిలు వడి పోయాయని "జోనల్‌స్కీము"ను వ్యతిరేకిం చాడు దీనితో స్కీము ఎగిరిపోయింది. జిల్లాలో తరుగుప్రాంతాల సప్లయిల బాధ్యత కూడ కలెక్టరు పర్చేజింగు ఆఫీసరుకు వదలి వేశారు. అంటే సరఫరా సక్రమంగా జరపా లనీ, వ్యాపారంపైన కూడ కంట్రోలు వుండా లనీ చేసే ప్రయత్నాలన్నీ భగ్నమయ్యాయి. మరొకసారి వ్యాపారులు వడ్లధరను రు. 12 వరకు పెంచి దొంగవ్యాపారం సాగిస్తున్నారు.

ఇప్పటి పరిస్థితులు ఏమిటి? దొంగ వ్యాపారం విచ్చలవిడిగా కొనసాగుతోంది. ఫలితం - వందలకొలది అర్ధాకలితో కాలం గడపవలసి వచ్చింది; వేలాదిజనం గింజల కోసం పట్టణాలకు ఎగబ్రాకుతున్నారు. అంటే, వీరి కొనుగోలుశక్తి పూర్తిగా పడిపోక ముందే సప్లయిలు విరివిగా పంపాలి.

ప్రభుత్వ కర్తవ్యం

ఈ ఘోరమైన ఆపాదకం. ప్రజల అవ స్థలు పోవాలంటే ప్రభుత్వం వెంటనే యీ క్రింది సూచనలు అనుసరించాలి.

(1) ధాన్యసేకరణ. ధాన్యసరఫరాలలో జిల్లాకలెక్టరు, పర్చేజింగుఆఫీసరు అనుసరించే విధానాలవల్ల కలిగే ఆపాదకం పోవాలంటే కలె క్టరుచేసే ప్రయత్నాలకు పర్చేజింగు ఆఫీసరు పూర్తిసహకార మివ్వాలి. (2) పురివద్దనే రు. 11 వడ్లధరను నిర్ణయిస్తూ జోనల్‌స్కీము ను తిరిగి ప్రవేశపెట్టాలి. (3) రేషనింగు పెట్టిన పట్టణాల అవసరాలకు, తరుగుప్రాంతాలకు అవసరమైనప్పుడు వెంటనే సప్లయిచేయడా నికి కావలసిన నిల్వలు ఏర్పరచాలి. అలా అయినప్పుడే రేషనింగు విషయంలో నెంబరి నిల్వలేక ప్రతి 3, 4 రోజుల కొకసారి - హఠాత్తుగా కమాండీరుచేయ వలసి రావడం, తరుగుప్రాంతాలకు వారాలతరబడికావాల్సినది సరఫరాకాక అవస్థలు పడడం తప్పుతుంది. (4) ఆహార సంఘాల సహకారంతో దొంగ మార్కెట్టును నాశనంచేయాలి (5) పర్మిట్లను యిచ్చేటప్పుడు, వాటినిమార్చి సప్లయిచేసేట ప్పుడు, అయ్యే వాదాలతరబడి ఆలస్యం జరగరాదు (6) స్వార్థపరుల ఆటంకాలను వాటి ధాన్యం సేకరణ విరివిగా జరపడానికి కొనుగోలు అధికారుల సంఖ్యను పెంచాలి. (7) మెట్ట ధాన్యాల అదనం సేకరించడానికి వెంటనే పూనుకోవాలి. (8) పూర్వంనుంచి ఆ వ్యాపారం లేకపోయినా, ఉంది సేల్సు టాక్సు కట్టియుండకపోయినా, లైసెన్సులు లేని గ్రామాలకు లైసెన్సులివ్వాలి.

రైతులకు విజ్ఞప్తి

మాగాణి గ్రామాల రైతుసోదరులారా! మెట్టతాలూకాల గ్రామాల్లో నేడు ఆహార ధాన్యాల ధరలు కంట్రోలుకు పూర్వంవలె మరల రు 50. లకు పెరిగాయి. ప్రభుత్వం తీవలంబించే ఏవిధానమైనా ప్రజాసహకారం లేనిదే విఫలమవక తప్పదని జిల్లా ఆహార సమస్య తీవ్రతే రుజువు చేస్తుంది. పైగా అధికలాభాలకాసించే భూమికలిగిన కొందరు స్వార్థపరుల, దొంగవ్యాపారుల, కుట్రలు మనసోదర రైతు-కూలీలకు సరసమైన ధర లకు గిట్టనివ్వడం లేదు. ఈ అల్లకల్లోలం నుండి బయటబడి, తమ ప్రాంతాలు మరొక బెంగాలుగా మారకుండుటకే వారంతా మీవంక జూస్తున్నారు. మనకు కావలసిన ఎరువులు, వ్యవసాయపనిముట్లు, ఉలవలు మొదలగునవి తంట్రోలుధరలకు కావాలని ఎలా ఆందోళన చేసి సంపాదించుకుంటున్నామో ఒకసారి ఆలోచించుకోండి. తోటిప్రజలు వీటన్నింటి కంటె జీవితానికి ముఖ్యాధారమైన ఆహారం కంట్రోలుధరకు దొరకాలని ఆశించడంతో ఆశ్చర్యమేమున్నది? ఇప్పటి కంట్రోలుధర తక్కువైతే, "అలాకాదు" అని పురివద్దనే రు. 11 లు నిర్ణయించమని కోరుతున్నాం. మనకోర్కె త్వరగా నెరవేరాలంటే దొంగ మార్కెట్టు ఆశచూపే హెచ్చుధరలకు లోను కారాదు. మనం అదనపుధాన్యాన్ని ఎంత విరివిగా సక్రమరేటుకు సప్లయిచేస్తామో అంత త్వరగా మనకోర్కెలు నెరవేరుతాయి. లేదా ప్రస్తుతం తరుగుతాలూకాలకు ప్రాప్తిం చినస్థితే యీ నీచవ్యాపారుల చర్యలవల్ల అదనంగా పండించిన మనకూ సంభవించక తప్పదు. బెంగాలు మొదలగు రాష్ట్రాలు మనకు నేర్పుతున్న పాఠంయిదే. సోదర రైతులంతా పైసూచనలను బలపరచి,ఆహార సమస్యా పరిష్కారానికి పూనుకుంటారని ఆశిస్తున్నాము.

కనగాల కుటుంబరావు
జిల్లా ఆహారకమిటీ కార్యదర్శి.

కోవూరుతాలూకాలో విపరీతమైన పశువుల నష్టం

వ్యవసాయానికి ముఖ్యాధారమైన పశువులు కోవూరు తాలూకా (నెల్లూరు జిల్లా) యందలి అల్లూరు, యిందుపూరు, విడవలూరు గ్రామాలలో చీడవల్ల విపరీతంగా చనిపోతు న్నాయి. ఒక్కగోగులపల్లి గ్రామంలో 100 పశువుల్లు చనిపోయాయి. తాలూకాయందలి వివిధ గ్రామాలలో యీ 6 నెలలలోను మొత్తం 10 వేల పశువులు నాశనమయాయి. అంటే దాదాపు 10 లక్షల రూపాయలనష్టం. ఈ విపరీత పరిస్థితులవల్ల అనేక బీద కుటుం బాలు అప్పులపాలైనాయి. పాడి నశించింది. రైతులు దుక్కి దున్న లేకపోతున్నారు. బండి ఎద్లు,నాగలిఎద్లు చనిపోవడంవల్లవ్యవసాయం కుంటుబడింది. గోగులపల్లి, యిందుపూరు, అల్లూరు, దంపూరు మొదలైన గ్రామాలలో యింతవరకు నాల్గవవంతు భూమికూడా దున్న లేదు. వైద్యసహాయం బొత్తుగాలేదు. ఈపరి స్థితుల్లో అల్లూరులో రైతుసంఘం స్వయంగా ఒక డాక్టరును పిలిపించి, 2 వేల పశువులకు చికిత్స చేయించింది. ఒక్కొక్కదానికి 0-10-0 చొప్పున మందులకు ఖర్చుఅయింది. తాలూకా పశువైద్య శాఖాధికారితో 17-8-44 తేదీని తాలూకా రైతుసంఘ కార్యదర్శి యీ విషయం తెలియజేయగా, ప్రతిగ్రామం వివ రాలతో రిపోర్టులు పంపమనీ, అలా పంపితే మందులు తెప్పిస్తాననీ, వాగ్దానం చేశారు. ప్రభుత్వాధికారులు వెంటనే పరిస్థితుల తీవ్ర తను గమనించి, తగిన వైద్యసహాయం చేయాలి. అధికాహారోత్పత్తికై రైతులకు తోడ్పడాలి.

ప్రజాశక్తి చందావివరాలు

సంవత్సరం చందా	5—0—0
అర్ధసంవత్సరం చందా	2—8—0
మూడునెలలచందా	1—4—0

ఆంధ్రరాష్ట్రంలో కొత్త సోవియటు ఫిల్ములు

మనదేశంలో సోవియట్ ఫిల్ములవ్యాప్తి బహుతక్కువ ఉన్నకొద్ది ఫిల్ములనైనా అన్ని రాష్ట్రాలలో ప్రదర్శించుటకు యీ మధ్యనే ప్రయత్నిస్తున్నారు. "కజాకిస్తాన్," "స్వాతం త్ర్యపోరాటంలో ఒకరోజు" అనే ఫిల్ములు రెండూ మన రాష్ట్రంలో ప్రధాన నగరాలలో ప్రదర్శింపబడ్డాయి. "స్టాలిన్‌గ్రాడ్‌యుద్ధం," "ఉక్రెయిన్ కొరకు పోరాటం" అను ఫిల్ము లను యింతవరకు బెజవాడలో చూపించారు. వీటిని, యింకా ఇతర ఫిల్ములను అన్ని తెలుగు పట్టణాలలో వరుసగా చూపుతున్నారు.

ఈ ఫిల్ములన్నింటిలోను, యుద్ధానికి పూర్వం సోవియట్ పౌరులు ఎట్టి స్వాతంత్ర్య జీవితం గడిపారో, హిట్లరు దురాక్రమణ ప్రారంభమయాక యుద్ధరంగంలోను, యుద్ధ రంగానికి వెనుక తమ రక్తం ధారపోసి యెలా తమ స్వాతంత్ర్యాన్ని కాపాడుకొంటున్నారో కళ్ళకు కట్టినట్లు చూపబడింది.

అయితే, ఫిల్ములన్నిటిలోను ఇంగ్లీషుభాష ఉపయోగింపబడ్డంచేత చాలామంది తెలుసుకో లేకపోతున్నారు. తెలుగులో తర్జుమాచేసి చెబితే, యీ లోపం చాలావరకుతొలగుతుంది.

(8వ పేజీ తరువాయి) తోహారులు సమర్పిం చిరి. బ్రిటిషు ఆంధ్రపత్రికలు నైజాం వార్తలు ప్రచురించి, బ్రిటిషు ఆంధ్రగ్రంధాలయాలు నిజాం ఆంధ్ర పత్రికలు తెప్పించి పరస్పర సంబంధాలు కల్పించుకోవలెనని హెచ్చ రించిరి.

అన్ని నైజాం గ్రంధాలయాలలో తెలుగు గ్రంధాలు చేర్చవలెనని, ధర్మగ్రంధాలయాలకు విరాళాలీయుడని నైజాం గ్రంధాలయాలకు స్థానికాధికారులు కల్పిస్తున్న ఆటంకాలు తొలగించవలెనని, తెలుగుకు ఎక్కువ ప్రాధాన్యత యివ్వవలెనని నైజాం ప్రభు త్వాన్ని, పెద్దలను కోరిరి.

వయోజన విద్యావ్యాప్తికి యాత్రలు, రేడియో ఉపన్యాసాలు, గోడ వార్తాపత్రికలు, ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ, పట్టభద్ర కోర్సు, యేర్పాటు చేయవలసినదిగా కోరిరి.

ఆంధ్రదేశంలోని అన్ని భాషల గ్రంధా లయాలు 'ఆంధ్రదేశ గ్రంధాలయ సంఘం' లో చేరవలెనని కోరిరి. ఆంధ్రగ్రంధ పట్టికను ప్రచురింపవలెననిరి.

వయోజన విద్యావ్యాప్తికి తీవ్రంగా కృషి చేయుచున్న యువక బృందములకు మహా సభవారు అభినందనాలు సమర్పించిరి.

సాయంత్రం ఆంధ్ర దేశ గ్రంధాలయ సర్వసభ్య సమావేశం సంఘాధ్యక్షులు శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారి అధ్యక్ష తను జరిగెను. ఇంతవరకు ఆంధ్రగ్రంధా లయ బాధ్యులకోనున్న అభిప్రాయభేదము లను తొలగొట్టి, 'ఆంధ్రగ్రంధాలయ సేవక సంఘాన్ని' ఆంధ్రదేశగ్రంధాలయ సంఘం లో కలిపివేసి,పత్రికను గ్రంధాలయసర్వస్వం పేరుతో ప్రచురించుటకునిశ్చయించిరి. ఆంధ్ర గ్రంధాలయోద్యమంలో ఈ మహాసభలు ఐక్యతను సాధించినవి. దీనికి శ్రీ పావిలాల గోపాలకృష్ణయ్య, బూరుగుల రామసుబ్బా రావుగార్లు ప్రశంసాపాత్రులు. ఆంధ్రగ్రంధా లయోద్యమంలో ఐక్యతను సాధించి ఆంధ్ర వికాసానికి గట్టి పునాదులు ఈ మహాసభలో వేయబడెను. ఐక్య గ్రంధాలయోద్యమం ముందుకు సాగిపోవాలెననేనినాదాలతో మహా సభ జయప్రదంగా ముగిసింది.

నైజాంలో జాతీయైక్యతావారం

దేశనాయకులిద్దరూ సమావేశం కాబో తున్నారు - త్వరలో హిందూముస్లిం సమస్య పరిష్కారమయి దేశానికి కళ్యాణం చేకూరు తుందని ఆశతో, ఆనందముతో ఎదురుచూ స్తూంది - భారత ప్రజానీకం, లెక్కలేనన్ని సభల్లో హిందువులు, ముస్లింలు ఏకముఖంగా నిల్చుని తమ సంతోషాన్ని వెల్లడించారు. నైజాంరాష్ట్ర ప్రజలకు గాంధీ - జిన్నా సమా వేశం మరింత సంతోషకరం. ఆరాష్ట్రాన్ని కూడా హిందూముస్లిం సమస్య పట్టుకొని పీడి స్తూంది. అనైక్యత సాధనంచేసుకొని ప్రజా ప్రాతినిధ్యంలేని ప్రభుత్వ కార్యనిర్వాహక వర్గం అక్కడకూడా ప్రజలనెత్తిమీద స్వారీ చేస్తుంది; అసమర్థతను, అవకతవకలను, శతవిధాల వెల్లడిచేస్తూంది. విశాల భారత దేశంలో జాతీయైక్యత కుదరడం తమ సమ స్యల పరిష్కారానిక్కూడా మార్గం చూప గలదని నైజాంప్రజల ఆశ. గతమాసం పది మొదలు 17 వరకు తెలంగాణా (నైజాం)లో జాతీయైక్యతావార సందర్భంలో ఈ ఆశే వెల్ల డయింది. ఈ వారంలో సభలు సమావేశాలు స్థానిక కమ్యూనిస్టుల ఆధ్వర్యాన జరిగినప్ప టికి ఆంధ్రమహాసభ జాతీయపక్షంవారు, ఇత్తి హాదుల్ ముసిల్మీన్ (స్టేటుముస్లిం సంస్థ), ఆర్యసమాజ్, ఖాక్సార్ మొదలయినసంస్థల వారు ఉత్సాహంతో ఇందులో పాల్గొన్నారు.

హైదరాబాదులో 10వ తేదీని కామ్రేడ్ మక్దుం అధ్యక్షతను బ్రహ్మాండమైన సభ జరి గింది. హిందువులు, ముస్లిములు, విద్యార్థులు, ఇతర వర్గాలవారు - వివిధ దృక్పథాలవారు అంతా 2500 మంది సభకు వచ్చారు. వీరిలో ముస్లింలు 100కి 45 గురు. ఇత్తిహాదుల్ ముసిల్మీన్‌నాయకులైన అబ్దుల్లా అల్మాన్‌దుని, అక్బర్ వఫాఖానిగార్లు; స్టేటు కాంగ్రెసు నాయకులైన దిగంబర్‌బిందు, రామకృష్ణ దూత్‌గార్లు సభను జయప్రదంచేశారు. ఆర్య సమాజ నాయకులైన పండిత నరేంద్రగారు కూడా వచ్చారు.

నైజాం ఆంధ్రమహాసభ అధ్యక్షులైన కామ్రేడ్ రావి నారాయణరెడ్డిగారి అధ్యక్షతను సికింద్రాబాదులో 18వ తేదీని సభ జరిగింది. సభకు వేయిమంది వచ్చారు. రైల్వే, బట్టల మిల్లు కార్మికులు ఎక్కువమంది వచ్చారు. స్థానిక ఇత్తిహాదుల్ ముసిల్మీన్ ఆధ్యక్ష కార్యదర్శులు, స్థానిక నిమ్నజాతి నాయకు డైన బి. యస్. వెంకటరావుగారు, సికింద్రా బాదు ప్రజాఆహారకమిటీకార్యదర్శి బి. యస్. మహాదేవసింగ్‌గారు సభకు వచ్చారు.

స్టేటులో జాతీయైక్యతకు మార్గం

గాంధీ - జిన్నాగార్ల సమావేశంయొక్క ప్రాముఖ్యాన్ని రెండుసభల్లోను అధ్యక్షులు వివ రించారు. హిందూముస్లిం ఐక్యత ప్రత్యేకంగా హైదరాబాదు సంస్థానానికెలా అవసరమో వెల్లడించారు. "రాష్ట్రంలో ప్రస్తుతం పరిపా లన సాగిస్తున్న కార్య నిర్వాహకవర్గానికి ఏలాంటి ప్రజా ప్రాతినిధ్యం లేదు. ఏ సమ స్యనూ సమర్థతతో ఎదుర్కోలేకుంటుంది. ప్రజల నానా ఇబ్బందులపాల్జేస్తూంది. ఈస్థితిని తొలగించ ప్రజాప్రాతినిధ్యం కలిగిన కార్య నిర్వాహకవర్గాన్ని స్థాపించుకోవలసినబాధ్యత నైజాం ప్రజలందరిమీదనుంది. అలాంటి కార్యనిర్వాహకవర్గమే ప్రస్తుతఆహారసమస్య మొదలయిన సమస్యల నన్నిటిని సమర్థతతో ఎదుర్కొని, ప్రజలకు శాంతిసుఖాలు చేకూర్చ గలదు. ప్రజలందరూ — హిందువులు, ముస్లిములు ఐక్యతతో, ఏకముఖంగా కృషి చేస్తేనే ఈ కార్యాన్ని సాధించగలం. ఆ ఐక్యత కుదరాలంటే హిందువులకు ముస్లింలకు మధ్య గల అనుమానాలు, అపో హలు తొలగిపోవాలి. ప్రజాప్రాతినిధ్యంగల ప్రభుత్వ వర్గంలో హిందువులు అధికసంఖ్యా కులుగ ఉంటారనే అనుమానం ముస్లిం సోద రుల్లోంచి తొలగించాలి. అందుకు ప్రభుత్వ వర్గంలో ముస్లిం జాతీయ సంస్థఅయిన ఇత్తి హాదుల్ ముసిల్మీన్‌కు సగం స్థానాలు, మహా రాష్ట్ర - ఆంధ్ర - కన్నడ మహాసభలకు కలిపి సగం స్థానాలు ఇవ్వాలి. నైజాం రాష్ట్రంలో జాతీయైక్యతకుదిరి, ప్రజలు అభి వృద్ధిగాంచాలంటే ఇదొక్కటే మార్గం గత మూడేళ్ళనుండికమ్యూనిస్టులు అహోరాత్రులు దీనిని ప్రచారంచేస్తున్నారు. భారత రాజకీ యాలు కూడా ఇదే ఉత్తమమార్గమని రుజువు చేస్తున్నాయ"ని అధ్యక్షోపన్యాసాలసారాంశం.

మధిరలో 500 మంది హిందూ-ముస్లింల ఎదుట పి. వి. రమణయ్యగారు, ఇల్లెందులలో 700 మంది సమక్షంలో నే. వి. రాఘవయ్య గారు; సూర్యాపేటలో రెండువేలమంది ఎదుట కందుల అనంతరాంరావుగారు; నల్లగొండలో 800 మంది ఎదుట మక్దుంగారు ఈ భావాలనే వెల్లడించారు. నేలకొండపల్లి, దోర్నకల్, భువ నగిరి మొదలయిన ప్రదేశాల్లో జాతీయైక్యతా వార ప్రదర్శనాలు ఐక్యతాసిద్ధికి ప్రజలను పురి కొల్పాయి. ఖమ్మంమెట్టులో విద్యార్థులు, జాతీయవాదులు, కమ్యూనిస్టులు, గుమాస్తాలు అంతా కలిసి రెండువందలమంది, అగస్టు 9న ప్రార్థనలు జరిపినప్పుడీ సుస్థిర ఐక్యతను సాధించాలనేదీక్ష వారి హృదయాల్లో ప్రజ్వ రిల్లింది.

(2వ పేజీ తరువాయి) బొంబాయి వెళ్లకుండా చేయడానికి హిందూమహాసభ వాలంటీర్లు సేవాగ్రాంలో పికెటింగ్ సహితం చేస్తూంటే, కాంగ్రెసువాదులు యీ చర్యను విరివిగా ఖండించనైనా ఖండించలేదు.

ఈ వైఖరికి కారణం ఏమిటి? వారి మనో భావాలు ఎలా వున్నాయి?

రాజాజీ ప్రణాళిక ఆచరణలోకివస్తే, దేశం ముక్కచెక్కలౌతుంది; అయినా దాన్ని నేటి పరిస్థితుల్లో అంగీకరించడమే ఉత్తమం ఎందు వల్లనంటే, బిర్రబిగుసుకొని కూర్చున్న జిన్నాను ఎలాగో అలా సంతృప్తిపరచాలి. దేశం తటస్థంగా ఉంటే, జిన్నా క్రిందికి దిగి వస్తాడు. ఇదీ నేడు కాంగ్రెసువాదుల దృక్పథం.

అంటే, ముస్లింలీగ్ కోరుతూన్న స్వయం నిర్ణయ సూత్రాన్ని కాంగ్రెసువాదులు న్యాయ మైన హక్కుగా పరిగణించడం లేదన్న మాట. ఆ హక్కును యిచ్చినప్పుడే హిందు వులు - ముస్లిములు సోదరభావంతో సమాన శత్రువును ఎదుర్కొంటారనే నమ్మకం. వారిలో కలుగలేదన్నమాట. ముస్లింరాజ్యాలు విడిపోవడంవల్ల హిందువులకే లాభంఅనే ధోరణిలో శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు 18వ తేదీని నెల్లూరులో ఉపన్యసించారు. "దేశవిభ జన వాంఛనీయం కాకపోయినా, ఇప్పుడది తప్పనిసరి అవుతున్నది....

"విడిపోయినందున హిందువులకే లాభం. ఏడేటా మిలిటరీవ్యయం 48 కోట్లలో దాదాపు సగం పంజాబు మహమ్మదీయులకే అర్పిస్తు న్నాం. రానున్న పాకిస్తాన్‌లోని భాగాలగు సింధు, సరిహద్దు రాష్ట్రాలకు ఏటేటా నేటి కేంద్రప్రభుత్వం విరాళాలపేర కొంతపొమ్ము యిస్తోంది ఇక బెలూచిస్తాన్‌లో మిలిటరీ మిషనుకు ఎంత ఖర్చుచేస్తున్నదో! కడచినాడు బెంగాల్ క్షామసందర్భంగా 10 కోట్ల గ్రాంటు యిచ్చింది. పాకిస్తాన్ అను స్వతంత్రరాజ్యమే ఉంటే, ఆ ఖర్చంతా ఆదే భరించుకొంటుంది. మనడబ్బు మనకే ఉంటుంది," అని గోపాల రెడ్డిగారు ఉపన్యసించారు. సారవంతమైన భూములన్నీ హిందువులకుంటాయనీ, వాదిం చారు.

ఇట్టి వాదనవల్ల ఐక్యత రాకపోగా, చీలి కలు యింకా పెరుగుతాయి. ముస్లింల అనుమానాలు ఇంకా ఎక్కువౌతాయి. ముస్లి ములు కూడా మనకు సోదరులేననీ, వారికో రిక న్యాయమైనదేననీ, వారి సహకారం లేక పోతే సమాన శత్రువును ఎదిరించలేమనీ ఇప్పటికైనా గ్రహించకపోతే, ఒడంబడిక కుదిరినప్పటికీ, అచిరకాలంలోనే అది భగ్నమై ఊరుకుంటుంది. వేవెల్‌ముఠా ప్లాను చక్కగా అమలు జరుగుతుంది.

వరదలను ఆపడానికి రైతుకూలీల చొరవ

ఈ సంవత్సరం గోదావరి వరదలు ప్రళయరూపంతో వచ్చాయి. [illegible] సంఖ్యలం, తమ కాలంలో యిలాంటి ప్రమా దకరమైన వరదలు యెరుగమని [illegible] సాగారు. "హఠాత్తుగావచ్చిన వరదల [illegible] ఉధృతంగా, లంకలయందలి పొలాల్లోనుండి [illegible] పంటలను బయటకు నెట్టుకొని పో[illegible] దామ:ఆలంకవద్ద (తూ. గోదావరి) [illegible] గండిపడి నాలుగైదు గ్రామాలకు [illegible] పరిస్థితి యేర్పడింది. అనేకరకులుబాధలో [illegible] కృషిచేసినవారికి గోరుచుట్టపై రోకటిపో[illegible] ట్లయింది ప్రజలస్థితి.

ప్రమాదాన్ని గుర్తించి, [illegible] సహిస్తే ధననష్టం విపరీతంగా కలుగు[illegible] దనే ఉద్దేశంతో వెంటనే అన్నివర్గాలప్రజ[illegible] పిలుపివ్వబడ్డది. కూలీలు, రైతులు, [illegible] లైన ప్రజలు యావన్మంది, తట్టలు, పారలు, గడ్డపలుగులు పుచ్చుకొని, నినాదాలిస్తూ కార్య రంగలో ప్రవేశించారు. పదినిముషాల్లో జరిగి పని ఒకనిమిషంలో జరుగుతోంది [illegible] రైతాంగమంతా కూలీయువకుల యెడల [illegible] భూతి, సుహృద్భావం వహించారు. రైతు కూలీ సామరస్యానికి యీకృషి [illegible] సాయపడుతుందని గ్రహించారు.

నాలుగు గంటలలో పనంతా పూర్తయింది. గట్టుపొడుగునా 2½ గజాల వెడల్పున మరొక గట్టు పోయబడింది. ప్రజలంతా, [illegible] కష్టించి, సాధించిన కార్యానికి సంతోషాన్ని పొందారు. ప్రజలప్రాణాలు, ఆస్తిపాస్తుల అంతగా నష్టపడకుండా దక్కాయి రైతు కూలీల అదన్ప కృషివల్ల.

ప్రజాశక్తి నూతన ప్రచురణలు

సోవియట్ రిపబ్లిక్ నూతనాధికారాలు

నూతన ప్రజాపోలెండు

చైనా జాతీయైక్యతాపోరాటం

ఫ్రెంచి జాతీయైక్యతాపోరాటం

సోవియట్ మిత్రమండలికి వివిధ దృక్పథాలవారి సహకారం

సోవియట్ ప్రజలు సాధిస్తున్న అసమాన విజయాలు, వారు నిర్మిస్తున్న నూతన చరిత్ర భారతదేశ నాయకులను, శాస్త్రవేత్తలను, విద్యార్థులను కదిల్చినయి. సోవియట్ విధానాన్ని గురించి ఎక్కువగా తెలుసుకోవాలనే అభిమానంతో అన్ని ముఖ్య పట్టణాల్లోని ప్రజలు సోవియట్ మిత్రమండలిని స్థాపించుకుంటున్నారు.

ఈ ఆశయంతోనే బందరు పట్టణ సోవియట్ మిత్రమండలి ప్రథమ సమావేశం 28-8-44 తేదీన టౌన్‌హాలులో డాక్టర్ రాళ్ళపల్లి అచ్యుతరామయ్య, యం. బి. బి. యస్. గారి అధ్యక్షతక్రింద ఏర్పాటు చేయబడింది. సమావేశంలో అన్ని రాజకీయ పక్షాలకు చెందిన వారు ఉన్నారు. వివిధవృత్తులకు చెందిన పెద్దలు ఉన్నారు. కాలేజి విద్యార్థులు చాలామంది వచ్చారు. సుమారు 200 మంది ఉత్సాహంతో సమావేశంలో పాల్గొన్నారు.

కన్వీనర్ ఎమ్. ఏ. ఖాదర్‌ఖాన్ (అడ్వకేటు) గారు సమావేశ ఆశయాలను గురించి చెప్పిన తరువాత, కాంగ్రెసువాదులైన శ్రీ. టి. ఏ. అబ్బాసుగారు, యమ్. శివరామయ్యగారు(కాలేజి లెక్చరర్), అలిబుల్లాఖాన్‌గారు సోవియట్ సమాజాన్ని గురించి, సోవియట్ విధానాన్ని గురించి జాగ్రత్తగా తెలుసుకొనవలసిన అవశ్యకతను గురించి ఉపన్యసించారు.

కంభంపాటి సత్యనారాయణ (జానియర్) గారు సోవియట్ మిత్రమండలి ఉద్యమం యొక్క చరిత్రగురించి, ఆశయాలను గురించి ఉపన్యసించారు.

స్థానిక సోవియట్ మిత్రమండలికి డాక్టరు రాళ్ళపల్లి అచ్యుతరామయ్యగారిని అధ్యక్షులుగను, టి. ఏ. అబ్బాస్‌గారిని ఉపాధ్యక్షులుగను ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శులు: ఎం. ఎ. ఖాదర్‌ఖాన్, వి. వి. యస్. సోమయాజులు. కమిటీసభ్యులు: జి. బ్రహ్మయ్య (అడ్వకేటు) ఎల్. సుబ్బారావు, డాక్టరు వెంకట్రామశాస్త్రి.

సోవియట్ మిత్రమండలి గ్రంథాలయ నిర్మాణమునకై సహాయపడుటకు డాక్టర్ వెంకట్రామశాస్త్రి, సోమయాజులుగార్లు 30 గ్రంథాలను బహూకరించారు.

★

మదనపల్లిలో

మదనపల్లి హైస్కూలు హాలులో అగస్టు 28 వ తేదీ ప్రొఫెసర్ పి. యస్. చారి గారి అధ్యక్షతక్రింద సోవియట్ మిత్రమండలి సమావేశం జరిగింది. అఖిలభారత సోవియట్ మిత్రమండలి కాంగ్రెస్‌ను గురించి సమావేశకర్త రిపోర్టును చదివినతర్వాత అధ్యక్షులు ఉపన్యసిస్తూ, రష్యా ప్రజాజీవితాన్ని సమగ్రంగా తెలుసుకొనడం అవసరమని, అందుకై యిట్టి సంఘాలు అవశ్యకమని చెప్పారు. నూతనంగా యేర్పడ్డకమిటీకి శ్రీ టి. యస్. రామకృష్ణారెడ్డిగారు (యం.యల్.ఏ.) అధ్యక్షులుగను, శ్రీ రాటకొండ నరసింహారెడ్డి కార్యదర్శిగను మరి 5 గురు యితరసభ్యులయెన్నుకోబడిరి.

నూలుకరువును ప్రతిఘటించుటకు కాంగ్రెస్ - కమ్యూనిస్టుల ఐక్యకృషి

ఉరవకొండ(అనంతపురంజిల్లా)లో చాలా ముఖ్యమైన నేతకేంద్రం, దాదాపు తెంబువేల మగ్గాలున్నాయి. 7 వేలకుపైన ప్రజలు నేత మీదనే ఆధారపడతారు. ప్రతినెల కనీసం 20 నెంబరు నూలుగల 300 బేళ్ళు ఈ మగ్గాలకు అవసరం.

కాని ఇప్పుడు నూలు సక్రమంగా దొరుకుట లేదు. మునుపటి వర్తకులకు మాత్రం 20 బేళ్ళను మిల్లుకోటా వున్నది. అదిచాలక దొంగమార్కెట్లద్వారా కొన్నిబేళ్ళు వస్తున్నాయి. వీటితోపాటు కంట్రోలుధరను వచ్చిననికూడా దొంగమార్కెట్లుకొకిపోయి. విపరీతమైన ధరలకు అమ్మబడుతూవున్నవి. ఇనుక చాలమంది నేతను ఆపివేశారు.

నెలకు నూలు కోటా 300 బేళ్ళుగా నిర్ణయించి రెగ్యులర్‌గా సరఫరా చేయించాలని స్థానిక చేనేతసంఘం, కమ్యూనిస్టుపార్టీ, కాంగ్రెసువాదులు కలిసి ఆందోళన చేస్తున్నారు. దొంగమార్కెట్లును అరికట్టి, నూలు సరఫరా చేయుటకు స్థానిక తహసీల్దారుతో కూడ వీరు ఒక కమిటీగా యేర్పడి గుడ్డ పుత్పత్తిని కాపాడుటకు పూనుకున్నారు.

తూర్పు గోదావరిజిల్లా కేశవపల్లి గ్రామములో కూడ యిలాగే 200 మగ్గాలు నూలులేక మూలపడ్డాయి.

అనిగడ్డ గ్రామంలో 50 మగ్గాలున్నాయి. 40 కుటుంబాలు చేనేత వృత్తివల్ల జీవించుచున్నారు. ఇదివరలో నూలు వస్తాయి రేపల్లెనుండి. ఇంకా ఇతరచోట్లనుండి తెచ్చుకొనేవారు. యిప్పుడు రేపల్లె లైసెన్సుదారులు ఒకజిల్లానుండి మరియొక జిల్లాకు యివ్వ నిరాకరించారు. ఇప్పుడు మగ్గాలులేక 200 మంది చేనేతపారిశ్రామికులు నిరాధారులుగ ఉన్నారు. ఈ గ్రామానికి నెలకు 2½ బేళ్ళనూలు అవసరం. ఈ నూలు లేకపోవుటచేత నెలకు 6000 గజాల గుడ్డ ఉత్పత్తి తరిగిపోవుచున్నది. వీరికి నూలు సప్లయి అయ్యేందుకు కృష్ణాజిల్లా టెక్స్టయిల్ ఆఫీసరు పూనుకోవాలి.

"యువకశక్తికి ఎదురులేదు"

"మాలో ఏ కొద్దిమందిలోనోవుండే అభిప్రాయాలను బహుజనాభిప్రాయాలుగ మార్చగలిగారు. మాలాగా పట్టణాలనుండి, కేవలం కాలేజీలనుండిగాక పల్లెలనుండి మీరురావటం మూలాన, ప్రజలతో సన్నిహిత సంబంధం కలిగి ఉండటంమూలాన ఈ కార్యక్రమం మీరింత జయప్రదంగా నిర్వహించగలుగుతున్నారు. మీ యువకశక్తికి ఎదురులేదు"— యువజన సంఘాలు నిర్వహిస్తున్న వయోజన విద్యా కార్యక్రమాన్నభినందిస్తూ దక్షిణ భారత వయోజన విద్యాశాఖ అధ్యక్షులయిన శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారిచ్చిన శ్లేకలివి.

కృష్ణాజిల్లా యువజనసంఘ ఆధ్వర్యాన, కొండపల్లి దశరథరామరెడ్డిగారి (సంఘ అధ్యక్షులు) అధ్యక్షతను గతమాసం 29 వ తేదీన బెజవాడ ఆఫీసులో జరిగిన సభలో హరిసర్వోత్తమరావుగారు ఉపన్యసించారు. యువజన, మహిళా వర్కర్లు వందమందికి పైగా సభలో పాల్గొన్నారు.

వయోజనవిద్యా ప్రచారకోద్యమ చరిత్రను హరిసర్వోత్తమరావుగారు కొంత చెప్పారు. 1937 లో రాజమండ్రిలో మొట్టమొదటసారిగా రాత్రిబడులు పెట్టామన్నారు. "ఏ కొద్దిమంది మాత్రమో వాటి ప్రాముఖ్యాన్ని గుర్తించారు; ఈనాడు అనేక వేలమందిచే దీని విలువ గుర్తించబడడం. ఒక్క కృష్ణాజిల్లా యువజనసంఘ ఆధ్వర్యాన్నే 70 కేంద్రాల్లో ఈ కార్యక్రమం కొనసాగింపబడడం ఎంతో ఆనందించవలసిన విషయం. ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తున్న ఇంతమంది ఉత్సాహవంతులను కలుసుకున్నందుకు సంతోషిస్తున్నా"నని వారన్నారు. వయోజన విద్యా ప్రచారానికి కావలసిన కొన్ని సలహాలను చెప్పారు. నైజాంఆంధ్ర ఆంధ్రమహాసభ అధ్యక్షులు శ్రీ రావి నారాయణరెడ్డిగారు, శ్రీయుతులు అయ్యంకి వెంకటరమణయ్య, వావిలాల గోపాలకృష్ణయ్యగారలు యువజనులను ఉత్తేజపరుస్తూ మాట్లాడారు.

"నిరక్షరాస్యతను నిర్మూలించండోయ్" అనే పాటను ఆ వందమంది యువతీ యువకులు, ఎలుగెత్తి పాడడంతో సభముగిసింది.

●

కొల్లూరు ద్వితీయ విద్యార్థి మహాసభ

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి శ్రీతమ్మారెడ్డి సత్యనారాయణగారి అధ్యక్షతక్రింద కొల్లూరు(గుంటూరుజిల్లా) ద్వితీయ విద్యార్థిమహాసభ అగస్టు 30 తేదీ సాయంత్రం జరిగింది. 350 మందికి పైగా విద్యార్థులు, పురపెద్దలు హాజరైనారు. శ్రీ కొరటాల సత్యనారాయణగారు విద్యార్థి పతాకాన్నెగురవేసి ప్రారంభోపన్యాస మిచ్చారు.

పురప్రముఖులు డాక్టర్ అంద్రిక బ్రహ్మయ్యగారు (కాంగ్రెసువాది) విద్యార్థి సమస్యలను పరిష్కరించుకోవానికి, దేశ స్వాతంత్ర్యాన్ని సాధించవానికి, ఐక్యవిద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాలనిన అవశ్యకతను గురించి మాట్లాడారు.

ఆటపాటల పోటీలలో గెలుపొందినవారికి బహుమతులివ్వబడ్డ తర్వాత, గాంధీ - జిన్నా సమావేశం జయప్రదంకావాలనీ, ఆదిఆంధ్ర, క్రైస్తవ విద్యార్థులకు కొత్తగా పెంచిన జీతాలను రద్దుచేయుమనీ, బాబురాజేంద్రప్రసాద్‌గారిని విడుదలచేయాలనీ తీర్మానాలు ఆమోదించబడ్డాయి.

రైల్వే అధికారి చర్యలను విచారణచెయ్యాలి

27-8-44 తేదీన గుత్తి రైల్వే కార్మికులు బహిరంగసభ జరిపి, గుత్తిసెక్షన్ కాన్పురెన్సు జరిగిననాటినుండి, యీ ఇనస్పెక్టరు జరుపుచున్న అత్యాచారాలను, ముఖ్యంగా కొట్టుట, తిట్టుట, పనిలోకి తీసుకోక గైరహాజరు చేయుట మొదలైనవాటిని ఖండించి వీటిపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని జనరల్ మేనేజరును కోరుతూ తీర్మానించారు. రైల్వే హాస్పిటల్‌లో ఒక నర్సునుకూడ నియమించాలని కోరారు.

గుత్తిలో రైల్వే కార్మికులకు కట్టెల కొరతలేదు. చుట్టుప్రక్కల అడవులనుంచి పాటకజనం తెచ్చి అమ్ముతారు. అందువల్ల గ్రెయిన్‌షాపు మేనేజరు, వాగనులలో కట్టెలు బహు స్వల్పంగా మాత్రమే అవసరముంటాయని తెలియచేశాడు. కాని యీ సూచనను చెవికెక్కించుకోక రైల్వే ఆహార కంట్రోలరు 60 వాగనుల కట్టెలు మే. జూన్ నెలలో పంపారు. అదిఖర్చుకావటంలేదు. మళ్ళీ అగస్టు చివరవారంలో మద్రాసుకు యెగుమతి చేస్తున్నారు.

అసలే రవాణా సౌకర్యాలకు వాగనుల సప్లయిచాలకపోతుంటే యెంత అనాలోచితంగా వాగనులువుపయోగించబడుతున్నాయో చూడండి.

అవసరమైతే కంట్రోలరును నియమించాలి

రాజమండ్రి స్పిన్నింగుమిల్లు తిరిగి పని చేయటం ప్రారంభించింది. కాని నూలు మాత్రం పూర్వం తయారైనంత తయారు కావటంలేదు. పూర్వం 20 నెంబరు నూలు తీసేవారు; ఇప్పుడు 11½ నెంబరు నూలు తీస్తున్నారు. పూర్వంనుంచి ఆ మిల్లులో పని చేసి అనుభవం గడించిన కార్మికులను తిరిగి చేర్చుకోలేదు అందువల్ల కొన్ని రోవింగు మెషీనులు (దారం తయారుచేసేవి)పనిచేయుట లేదు. పని దాదాపు మూడువంతులు పడిపోయింది.

కంట్రాక్టు కూలీలకు పూర్వం రోజుకు రు. 1-4-0 గిట్టేది. ఇప్పుడు రు. 1-0-0 మాత్రం కూలి యిస్తున్నారు. స్త్రీలకు రు. 0-8-0 ముట్టేది; ఇప్పుడు రు. 0-3-0 కూడ కళ్ళచూడటంలేదు. ఇక మిల్లు అధికారులు యీ స్త్రీలను నానామాటలు అంటారు. ఇవి సహించలేక 20 మంది స్త్రీలు మిల్లుపనికి నీళ్లువదలుకొనిపోయారు.

ఈ పరిస్థితులు గమనించి, నూలువుత్పత్తి తగ్గకుండా చేయటానికని యూనియన్ తరఫున జిల్లాకలెక్టరువద్దకు రాయబారం వెళ్లారు. నిపుణులైన కార్మికులను తిరిగి పనిలో పెట్టుకోవాలని, ఉత్పత్తికి ఆటంకంగావున్న ఇతర కారణాలను విచారణ చెయ్యాలని కోరారు. జిల్లాకలెక్టరు లేబరు ఆఫీసరును విచారణ చెయ్యమని పంపారు. వారు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులవద్దనుంచి స్టేటుమెంట్లు తీసుకున్నారు.

ఉత్పత్తిని కాపాడి నూలు కరువును పోగొట్టటానికి, ప్రభుత్వం వెంటనే జోక్యం కలిగించుకొని 21-8-44 తేదీన అరెస్టుచేసిన బి. వెంకటేశ్వరావు, మీరాసాహెబుగార్లపై కేసులు పుపసంహరించుకోవాలి. ఒక కంట్రోలరును నియమించి, వుత్పత్తి సక్రమంగా సాగేటట్లు చూడాలి.

★ యుద్ధసమీక్ష

— ఫ్రాన్సు విముక్తి పూర్తికానుంది
— జర్మనీతో ఫిన్లండు తెగతెంపులు
— నాజీలపన్నాగాలు భగ్నంకాకతప్పదు

ఫ్రాన్సులో రోన్, అమియన్స్, రీమ్సు మొదలయిన ముఖ్యప్రదేశాలు మిత్రసేనల వశమయ్యాయి. వెనుక బ్రిటిష్, కెనడా సేనలు జర్మన్ రక్షణలపై హటాత్తుగ దాడిజరిపి, వాటి బలాబలాలను పరీక్షచేసినచోటు డియప్. ఆ సంఘటనలో పాల్గొన్న కెనడాదళాలే నేడు తిరిగి ఆ రేవుపట్టణంపై దాడిజరిపి, దానిని పూర్తిగా వశపరచుకొన్నాయి, 1914 ప్రపంచ యుద్ధంలో ప్రసిద్ధికెక్కిన వెర్డన్‌దుర్గం నాజీల చెరనుండి విముక్తిపొందింది. ఈ విజయ పరంపరలను సాధించి మిత్రసేనలు ఫ్రాన్సు పొలిమేరలను దాటి ముందుకు పోయాయి. అమెరికా సేనలు ముందు దారితీశాయి. బెల్జియం సరిహద్దును దాటి ముందుకు పోయాయి. రాజధాని బ్రస్సెల్సు నగరాన్ని చెరవిడిపించాయి. ఈ పురోగమనానికి అక్కడి దేశభక్తులు ఎంతో తోడ్పడ్డారు. వారుచేసిన ఈ మహోపకారానికి కృతజ్ఞతను తెలుపుతూ జనరల్ ఐసన్‌హోవర్ ఒకప్రకటన చేశాడు. ఇంకా ఎక్కువగా నాజీలపై దెబ్బతీయమని కోరాడు. హాలండులో కూడా గెరిల్లాదళాలు విజృంభించడానికి సిద్ధపడుతున్నాయి.

దక్షిణ ఫ్రాన్సులో మిత్రసేనలు పారిపోతున్న జర్మన్‌దళాలను వెన్నంటి తరుముతూ, ఇటలీ సరిహద్దునుదాటి ముందుకు పోయాయి. ఫ్రాన్సులో ఇంకా మిగిలివున్న నాజీమూకలు ఏదో ఒక కంతచూచుకొని పారిపోవానికి ప్రయత్నిస్తున్నాయి. వాటిని చీల్చి చెండాడుతున్నాయి గెరిల్లాదళాలు. ఫ్రాన్సుభూభాగంపై తీవ్రయుద్ధాలు ముగిశాయనే చెప్పవచ్చు. ఫ్రాన్సువిముక్తి పూర్తి అయిందనే అనవచ్చు. ఫ్రెంచి జాతీయ స్వాతంత్ర్య సంఘం (తాత్కాలిక ప్రభుత్వం) ఆల్జీర్సు నుండి పారిస్‌కు బయలుదేరింది. త్వరలో ఫ్రెంచి ప్రజలు తమ ప్రభుత్వాన్ని స్థాపించుకుంటారు.

జర్మన్ల ప్లాను

బెల్జియంలోకూడా జర్మన్లు తీవ్రప్రతిఘటన చూపుతున్నట్లులేదు. మిత్రసేనల బారినుండి తమ సేనలను కాపాడుకోవడమే ముఖ్యంగా ఎంచుతున్నట్లుంది నాజీలు. అగస్టు 24 వ మాక్సుక్రుల్ అనే జర్మన్ ప్రచారకుడు ఈవిషయాన్నే సూచించాడు. "పడమటి రంగంలోని జర్మన్ సేనలు జర్మనీ సరిహద్దు ప్రాంతంలో వీలయినంత చిన్న శ్రేణిలో అమర్చబడుతున్నాయి. ఇందువల్ల ఆ సేనల శక్తి మరింత హెచ్చుతుంది" అని ఆయన అన్నాడు. దుర్భేద్యమైన 'పడమటి కోట' (జర్మన్ సరిహద్దుపైనున్న జీగ్‌ఫ్రీడ్ శ్రేణి) వెనుకకు తన సేనలను మరల్చడమే ప్రస్తుతం హిట్లరుప్లాను" అని గోబెల్సుకూడా ప్రకటించాడు.

నాజీ నరహంతకుల ప్లాను అంతటితో ఆగలేదు. పడమట ఈవిధంగా మిత్రసేనలను నామమాత్రంగా ప్రతిఘటిస్తూ, మరోవైపు. అదేసమయంలో సంధిప్రయత్నాలను సాగించాలని వారి యెత్తుగడ. ఎటు చూచినా ప్రజాశక్తులు ఉప్పెనగా పొంగుతున్నాయి. ఒక్కటొక్కటిగ ఆక్రమిత దేశాలు నాజీలకుత్తుకలు నరికే వాడికత్తులయి పోతున్నాయి. అటు రెడార్మీ తమ తూర్పు ద్వారాన్ని పగలగొడుతూంది. వీటిబారినుండి ఏదో ఒకవిధంగా తప్పించుకోవానికి నాజీలు తాపత్రయ పడడంలో ఆశ్చర్యంలేదు. "రాయబారాలుజరిపి సంధి కుదుర్చుకోవాలని జర్మనీ కోరుతున్నట్లు కనబడుతూంది." అని యునైటెడ్ స్టేట్సు విదేశాంగకార్యదర్శి కార్డల్‌హాల్ ఈ విషయాన్నే సూచాయిగా చెప్పాడు. త్వరలో జరుగనున్న చర్చిల్ - రూజువెల్టు సమావేశంలో ఈ విషయం చర్చకు వస్తుందనికూడా పదంతులు.

ఎంతవరకు కొనసాగగలదు?

ఈ ఎత్తుగడ సాగాలంటే నాజీలు బ్రిటన్, అమెరికాలలోఉన్న తమ అభిమానులమీదనే ఆధారపడాలి. వీళ్ళ కుట్ర ఈనాడెంతవరకు సాగగలదు? ఇంతవరకు ఈయుద్ధం సాగిన తీరును కొంచం పరిశీలిస్తే, ఈప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. నాజీల కథ అర్థం తిరగ్గానే అంతవరకు వారిని అంటిపెట్టుకొని ఉండిన ఉపగ్రహాలు ప్లేటుమార్చడం సాగించాయి. ఫ్రాన్సువిషయంలో డార్లాన్, ఇటలీలో బదోగ్లియో ఇందుకు నిదర్శనం. కాని నాజీ వ్యతిరేక మహాప్రవాహం వీరిని ప్రక్కకు తోసి ముందుకు సాగింది. ఫ్రాన్సులో సామ్రాజ్యవాదుల ఆటను కొనసాగించాలను కొన్న జిరోకూడా ఇదేగతిపట్టింది. చర్చిలు, మిత్రమండలి మిలిటరీ ప్రభుత్వాలుకూడా ఏమీ చేయలేకపోయాయి. పోలండు, యుగోస్లావియాల్లోను యిదేకథ. మొదటినుంచి పాసిజాన్నెదుర్కొని, ధైర్య స్థయిర్యాలతో స్వాతంత్ర్యపోరాటం కొనసాగించిన కమ్యూనిస్టుపార్టీ వంటి ప్రజాపక్షాలదే ఈ దేశాల్లో నేడు పైచేయి. ఇప్పుడు రుమేనియా కూడా చేరింది. బ్రిటన్ అమెరికాల్లోని నాజీ అనుకూలురుగాని, సామ్రాజ్యవాదముఠాలుగాని, ఈ మార్పును ఆపలేకపోయాయి. దీనినిబట్టి చూస్తే, యీనాడు యూరప్‌లో పరిస్థితులను తీర్చి దిద్దుతున్నది వికరమయిన ఫాసిస్టు వ్యతిరేకశక్తులు - ప్రజాశక్తులని స్పష్టపడుతూంది. ఇక నాజీ అభిమానుల పలుకుబడి ఎక్కడ? జర్మన్ నాజీ మూకలకు రాయబారాలద్వారా సంధి లభించడమెక్కడ?

ఉచ్చు బిగుస్తూంది

ఈలోగా జర్మనీచుట్టూ ఉచ్చుబిగుస్తూంది. పడమట మిత్రసేనలు జర్మనీ సరిహద్దు పైకి పరుగు పరుగున వస్తున్నాయి. తూర్పున రెడార్మీ అఖండవిజయాలు సాధిస్తూ ముందుకురుకుతూంది. రుమేనియాలో పోలెస్టి నూనెగనులు, చక్కని నూనెగనుల ప్రదేశమంతా కూడా రెడార్మీవశమయింది. ఇక్కడి జర్మన్ సేనలను తరుముకుంటూపోయి రెడార్మీ రుమేనియా రాజధాని అయిన బుఖారెస్టును ప్రవేశించింది. ప్రధానరేవుపట్టణం కాంస్టాంజా కూడా నాజీచెరనుండి విముక్తి పొందింది. సముద్రం మీదనుండి, భూమి మీదనుంచి దాడిచేసి ఈ నగరాన్ని వశపరచుకొన్నారు. ఇక్కడనాజీలు కూడబెట్టిన పెద్దపెద్ద చమురుస్టాకులు చెక్కుచెదరకుండా రెడార్మీకి వశమయాయి. ఈలోగా సోవియట్ నల్లసముద్ర నౌకాదళాలు డాన్యూబ్ నది మీదుగా లోపలకు వెళ్ళి, టల్సియా, సులినా అనే ముఖ్య నౌకాశ్రయాలకు విముక్తి నిచ్చాయి.

రెడార్మీ ఇప్పుడు బల్గేరియా సరిహద్దుపైకి చేరుకుంది, యుగోస్లావియా సరిహద్దు వైపు పురోగమిస్తూంది. ట్రాన్సిల్వేనియా పర్వత సానువుల్లో జర్మన్లను చీల్చి చెండాడుతూంది.

త్వరలో రెడార్మీ యుగోస్లావియాలోని టిటోసేనలతో చేతులు కలుపుతుంది. తత్ఫలితంగా ఉత్తర ఇటలీపై ఒత్తిడి హెచ్చుతుంది. తూర్పునుంచి మిత్రసేనలు అప్పుడే ఉత్తర ఇటలీలో చొరబడ్డాయి, ఇక ఇక్కడి నాజీమూకలకు పలాయనం చిత్తగించడమో, లేక సర్వనాశనం కావడమో తప్ప వేరేగతి ఉండదు. అంతేగాకుండా గ్రీసు, ఆల్బేనియాలకుకూడా త్వరలో దాస్యవిముక్తి లభించగలదు.

ప్రధాన రంగం

పోలండు, తూర్పుప్రష్యా, బాల్టిక్‌రంగాలలో రెడార్మీ జర్మన్ ప్రతిఘటనను విచ్ఛిన్నం చేస్తూంది. జర్మన్లు తమసర్వస్వాన్నొడ్డి ఇక్కడ ప్రతిఘటిస్తున్నారు. ఎందువల్ల? 'హిందుస్థాన్ టైమ్సు' పత్రికలందను విలేఖరిరాస్తున్నట్లు ఈమహాయుద్ధం యొక్క అంతిమఫలితాలను తేల్చగలది ఈరంగమే. "అక్కడ చూడవలసింది ఎంత దూరం ముందుకు పోయారు, ఎన్ని ప్రదేశాలు పట్టుకున్నారన్నదికాదు. జర్మన్‌రిజర్వు సేనలగతి కొద్దిరోజులలోనే అక్కడ తేలిపోతుంది. వాటిపని పట్టడం పూర్తికాగానే రెడార్మీ అడ్డూఅపూలేని ప్రవాహంలాగా పొంగి జర్మనీని ముంచెత్తుతుంది." అని అభిప్రాయం.

ఫిన్లండు

ఈ రెడార్మీ విజయాల ఫలితంగా ప్రజలపక్షానికి మరో లాభం చేకూరింది. జర్మనీని అంటిపెట్టుకుని ఉండటం ఇక లాభం లేదని ఫిన్లండు ప్రభుత్వం గుర్తించింది. జర్మనీతో విడిపోయి - సోవియట్‌తో ఒడంబడిక కుదుర్చుకోవానికి నిర్ణయించింది. ఈ కోర్కెను సోవియటుకు తెలిపింది. "సెప్టెంబరు 15 వ తేదీ లోగా మాదేశం వదలిపొండని" దేశంలో ఉన్న జర్మన్ సేనలను కోరింది.

ఫిన్లండు ఈ యుద్ధంలోంచి విరమించి, శాంతిని అనుభవించడానికి సోవియట్ ఎన్నోసార్లు అవకాశం కలిగించింది. మిత్రరాజ్యాలుకూడ బోధచేశాయి. కాని ఫిన్లండు పాలకవర్గం ఆ అవకాశాలన్నింటిని కాలదన్నింది. ఈనాడు జర్మన్ కౌగిలింతలో అంద ఇక వారికిలేదు. సోవియట్‌ని శరణు వేడక తప్పిందికాదు. ఫిన్లండు ప్రజలకు శాంతి చేకూర్చడానికి సోవియట్ ఎప్పుడూ సుముఖంగానే ఉంది. యుద్ధ విరామం గురించి ఫిన్లండు రాయబారవర్గంతో త్వరలో సంప్రదింపులు జరుగగలవు. జర్మన్ మూకల నిష్క్రమణ, సోవియట్లతో శాంతి ఒడంబడిక - వీటిఫలితంగా ఫిన్లండులో త్వరలో గొప్పమార్పులు రాగలవు. ప్రజాస్వామ్య శక్తుల నాయకత్వం క్రింద ఫిన్లండు ప్రజలు శాశ్వత శాంతి, అభివృద్ధులు పొందగల పరిస్థితి యేర్పడగలవు.

4—9—44

— కాపీ మోహన్‌రావు

కృష్ణాజిల్లా ఈనాం రైతుల మహాసభ

ఇటీవల మద్రాసు ప్రభుత్వంవారు ప్రజాభిప్రాయంకొరకు ప్రకటించిన ఎస్టేటుల్యాండు ఆక్టు సవరణనుగూర్చి ఈనాం రైతుల అభిప్రాయం తెలియపర్చుటకుగాను కృష్ణాజిల్లా ఈనాంరైతుల మహాసభ 30—8—44 న గుడివాడలో సుప్రసిద్ధ కాంగ్రెసువాదులును, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ వర్కింగుకమిటీ సభ్యులునైన శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారి అధ్యక్షతను జరుపబడెను.

సభకు అన్నితాలూకాలనుండి 500 మంది రైతులు హాజరయిరి. ముఖ్యంగా గుడివాడ తాలూకాలోని సోమవరప్పాడు, గండేపూడి వగైరా గ్రామాలనుండి యీనాం రైతులు అన్నంమూటలతో సహా వచ్చి సభలో పాల్గొన్నారు.

సభ మధ్యాహ్నం గం. 3 లకు గౌరీశంకర హాలులో ప్రారంభమైంది. కేతవరపు నరసింహంగారు, సూరంపూడి శ్రీహరిరావుగారు మొదలగు కాంగ్రెసు వాదులు, త్రిపురనేని కాశీవిశ్వనాథం బి. ఎ. బి. యల్. గార్లు సభకు హాజరయ్యారు.

అధ్యక్షులు ప్రస్తుతబిల్లునుగూర్చి, ఈనాం రైతుల కష్టాలనుగూర్చి విపులంగా మాట్లాడి, అగ్రహారం రైతుల కష్టాలను తీర్చి వారి హక్కులను కాపాడుటకు యెక్కువ కృషి జరగలేదనీ, యిందుకు కారణం పైతరగతి ప్లీడర్లు వగైరా యీనాందారులో, లేక వారి బంధువులో అయివుండడమని చెప్పారు. ఈనాం రైతులుకూడా రైతుసంఘాల్లోచేరి, రైతుసంఘాలను బలపర్చుట ద్వారా తమ హక్కులను కాపాడుకోవాలని పురోద్బోధించారు.

తదుపరి అధ్యక్షస్థానం నుండియే ప్రభుత్వంవారు ప్రకటించిన చిత్తుబిల్లును ఆంధ్రరాష్ట్ర ఈనాం రైతుల కమిటీవారు సూచించిన సవరణలను బలపరుస్తూ, ఆంధ్రరాష్ట్ర ఈనాందార్ల సంఘం ఇటీవల బెజవాడలో సమావేశమై 50 ఎకరముల మాగాని, 100 ఎకరముల మెట్టవున్న యీనాందార్లకు యీ బిల్లు వర్తించకూడదని చేసిన సూచనను ఖండిస్తూ, పై యీనాందార్ల సూచనను ప్రభుత్వం ఆమోదించకుండా రైతులకు సంపూర్ణ న్యాయం కలుగజేయాలనీ కోరుతూ, తీర్మానం ప్రవేశపెట్టిరి.

కృష్ణాజిల్లా రైతుసంఘాధ్యక్షులైన శ్రీ అనుమర్లపూడి వెంకట సీతారామారావు గారు తీర్మానాన్ని బలపరుస్తూ యీనాందార్లకు 50 యకరాలు మాగాణి, 100 ఎకరాలు మెట్ట మినహాయిస్తే, వున్న యీనాం అన్నిటినీ, వారు పిల్లలపేర, పెద్దలపేర విభజించుకొనుట ద్వారా బిల్లునుండి తప్పించుకొని, రైతులకు కలుగవలసిన న్యాయమైన భూమియిత్తి హక్కు కలుగకుండా చేస్తారు కాబట్టి, ఆ మినహాయింపును ఆమోదించగూడదని స్పష్టపరచారు. పిమ్మట శ్రీ సూరంపూడి శ్రీహరిరావు, చలసాని రామచంద్రయ్యగార్లు తీర్మానాన్ని బలపరుస్తూ మాట్లాడారు.

★ యుద్ధసమీక్ష

— ఫ్రాన్సు విముక్తి పూర్తికానుంది
— జర్మనీతో ఫిన్లండు తెగతెంపులు
— నాజీలపన్నాగాలు భగ్నంకాకతప్పదు

ఫ్రాన్సులో రోన్, అమియన్స్, రీమ్సు మొదలయిన ముఖ్యప్రదేశాలు మిత్రసేనల వశమయాయి. వెనుక బ్రిటిష్, కెనడా సేనలు జర్మన్ రక్షణలపై హటాత్తుగ దాడిజరిపి, వాటి బలాబలాలను పరీక్షచేసినచోటు డియప్. ఆ సంఘటనలో పాల్గొన్న కెనడాదళాలే నేడు తిరిగి ఆ రేవుపట్టణంపై దాడిజరిపి, దానిని పూర్తిగా వశపరచుకొన్నాయి. 1914 ప్రపంచ యుద్ధంలో ప్రసిద్ధికెక్కిన వెర్డన్‌దుర్గం నాజీల చెరనుండి విముక్తిపొందింది. ఈ విజయ పరంపరలను సాధించి మిత్రసేనలు ఫ్రాన్సు పొలిమేరలను దాటి ముందుకు పోయాయి. అమెరికా సేనలు ముందు దారితీశాయి. బెల్జియం సరిహద్దును దాటి ముందుకు పోయాయి. రాజధాని బ్రసెల్సు నగరాన్ని చెరవిడిపించాయి. ఈ పురోగమనానికి అక్కడి దేశభక్తులు ఎంతో తోడ్పడ్డారు. వారుచేసిన ఈ మహోపకారానికి కృతజ్ఞతను తెలుపుతూ జనరల్ ఐసన్‌హోవర్ ఒకప్రకటన చేశారు. ఇంకా ఎక్కువగా నాజీలపై దెబ్బతీయమని కోరారు. హాలండులో కూడా గెరిల్లాదళాలు విజృంభించడానికి సిద్ధపడుతున్నాయి.

దక్షిణ ఫ్రాన్సులో మిత్రసేనలు పారిపోతున్న జర్మన్‌దళాలను వెన్నంటి తరుముతూ, ఇటలీ సరిహద్దునుదాటి ముందుకు పోయాయి. ఫ్రాన్సులో ఇంకా మిగిలిఉన్న నాజీమూకలు ఏదో ఒక కంతచూచుకొని పారిపోడానికి ప్రయత్నిస్తున్నాయి. వాటిని చీల్చి చెండాడుతున్నాయి గెరిల్లాదళాలు. ఫ్రాన్సుభూభాగంపై తీవ్రయుద్ధాలు ముగిశాయనే చెప్పవచ్చు. ఫ్రాన్సువిముక్తి పూర్తి అయిందనే ఎంచవచ్చు. ఫ్రెంచి జాతీయ స్వాతంత్ర్య సంఘం (తాత్కాలిక ప్రభుత్వం) ఆల్జీర్సు నుండి పారిస్‌కు బయలుదేరింది. త్వరలో ఫ్రెంచి ప్రజలు తమ ప్రభుత్వాన్ని స్థాపించుకుంటారు.

జర్మన్ల ప్లాను

బెల్జియంలోకూడా జర్మన్లు తీవ్రప్రతిఘటన చూపుతున్నట్లులేదు. మిత్రసేనల బారినుండి తమ సేనలను కాపాడుకోవడమే ముఖ్యంగా ఎంచుతున్నట్లుంది నాజీలు. ఆగస్టు 24 వ మాక్సుక్రుల్ అనే జర్మన్ ప్రచారకుడు ఈవిషయాన్నే సూచించాడు. "పడమటి రంగంలోని జర్మన్ సేనలు జర్మనీ సరిహద్దు ప్రాంతంలో వీలయినంత చిన్న శ్రేణిలో అమర్చబడుతున్నాయి. ఇందువల్ల ఆ సేనల శక్తి మరింత హెచ్చుతుంది" అని ఆయన అన్నాడు. దుర్భేద్యమైన 'పడమటి కోట' (జర్మన్ సరిహద్దుపైనున్న జీగ్‌ఫ్రీడ్ శ్రేణి) వెనుకకు తనసేనలను మరల్చడమే ప్రస్తుతం హిట్లరుప్లాను" అని గోబెల్సుకూడా ప్రకటించాడు.

నాజీ నరహంతకుల ప్లాను అంతటితో ఆగలేదు. పడమట ఈవిధంగా మిత్రసేనలను నామమాత్రంగా ప్రతిఘటిస్తూ, మరోవైపు, అదేసమయంలో సంధిప్రయత్నాలను సాగించాలని వారి యెత్తుగడ. ఎటు చూచినా ప్రజాశక్తులు ఉప్పెనగా పొంగుతున్నాయి. ఒక్కటొక్కటిగ అక్రమిత దేశాలు నాజీలతుత్తుకలు నరికే వాడికత్తులయి పోతున్నాయి. అటు రెడార్మీ తమ తూర్పు ద్వారాన్ని పగలగొడుతూంది. వీటిబారినుండి ఏదో ఒకవిధంగా తప్పించుకోడానికి నాజీలు తాపత్రయ పడడంలో ఆశ్చర్యంలేదు. "రాయబారాలజరిపి సంధి కుదుర్చుకోవాలని జర్మనీ కోరుతున్నట్లు కనబడుతూంది." అని యునైటెడ్ స్టేట్సు విదేశాంగకార్యదర్శి కార్డల్‌హాల్ ఈ విషయాన్ని సూచాయిగా చెప్పాడు. త్వరలో జరగనున్న చర్చిల్ - రూజువెల్టు సమావేశంలో ఈ విషయం చర్చకు వస్తుందనికూడా అంటారు.

ఎంతవరకు కొనసాగగలదు ?

ఈ ఎత్తుగడ సాగాలంటే నాజీలు బ్రిటన్, అమెరికాలలోఉన్న తమ అభిమానులమీదనే ఆధారపడాలి. వీళ్ళ కుట్ర ఈనాడెంతవరకు సాగగలదు ? ఇంతవరకు ఈయుద్ధం సాగిన తీరును కొంచం పరిశీలిస్తే, ఈప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. నాజీల కథ అడ్డం తిరగ్గానే అంతవరకు వారిని అంటిపెట్టుకొని ఉండిన ఉపగ్రహాలు ప్లేటుమార్చడం సాగించాయి. ఫ్రాన్సువిషయంలో డార్లాన్, ఇటలీలో బడోలియో ఇందుకు నిదర్శనం. కాని నాజీ వ్యతిరేక మహాప్రవాహం వీరిని ప్రక్కకు తోసి ముందుకు సాగింది. ఫ్రాన్సులో సామ్రాజ్యవాదుల ఆటను కొనసాగించాలనుకొన్న జిరోక్కూడా ఇదేగతిపట్టింది. చర్చిలు, మిత్రమండలి మిలిటరీ ప్రభుత్వాలుకూడా ఏమీ చేయలేకపోయాయి. పోలండు, యుగోస్లావియాల్లోను యిదేకథ. మొదటినుంచి ఫాసిజాన్నెదుర్కొని, ధైర్య స్థైర్యాలతో స్వాతంత్ర్యపోరాటం కొనసాగించిన కమ్యూనిస్టుపార్టీ వంటి ప్రజాపక్షాలదే ఈ దేశాల్లో నేడు పైచేయి. ఇప్పుడు రుమేనియా కూడా చేరింది. బ్రిటన్ అమెరికాల్లోని నాజీ అనుకూలురుగాని, సామ్రాజ్యవాదముఠాలుగాని, ఈ మార్పును ఆపలేకపోయాయి. దీనినిబట్టి చూస్తే, యీనాడు యూరప్‌లో పరిస్థితులను తీర్చి దిద్దుతున్నది నికరమయిన ఫాసిస్టువ్యతిరేకశక్తులు - ప్రజాశక్తులని స్పష్టపడుతూంది. ఇక నాజీ అభిమానుల పలుకుబడి ఎక్కడ ? జర్మన్ నాజీ మూకలకు రాయబారాలద్వారా సంధి లభించడమెక్కడ ?

ఉచ్చు బిగుస్తూంది

ఈలోగా జర్మనీచుట్టూ ఉచ్చుబిగుస్తూంది. పడమట మిత్రసేనలు జర్మనీ సరిహద్దు పైకి పరుగు పరుగున వస్తున్నాయి. తూర్పున రెడార్మీ అఖండవిజయాలు సాధిస్తూ ముందు కురుకుతూంది. రుమేనియాలో పోలెస్టి నూనెగనులు, చక్కని నూనెగనుల ప్రదేశమంతా కూడా రెడార్మీవశమయింది. ఇక్కడి జర్మన్ సేనలను తరుముకుంటూపోయి రెడార్మీ రుమేనియా రాజధాని అయిన బుకారెస్టును ప్రవేశించింది. ప్రధానరేవుపట్టణం కాంస్టాంజా కూడా నాజీచెరనుండి విముక్తి పొందింది. సముద్రం మీదనుండి, భూమి మీదనుండి దాడిచేసి ఈ నగరాన్ని వశపరచుకొన్నారు. ఇక్కడనాజీలు కూడబెట్టిన పెద్దపెద్ద చమురుస్టాకులు చెక్కు చెదరకుండా రెడార్మీకి వశమయాయి. ఈలోగా సోవియట్ నల్లసముద్ర నౌకాదళాలు డాన్యూబ్ నది మీదుగా లోపలికి వెళ్ళి, టల్సియా, సులినా అనే ముఖ్య నౌకాశ్రయాలకు విముక్తి నిచ్చాయి.

రెడార్మీ ఇప్పుడు బల్గేరియా సరిహద్దుపైకి చేరుకుంది, యుగోస్లావియా సరిహద్దు వైపు పురోగమిస్తూంది. ట్రాన్సిల్వేనియా పర్వత సానువుల్లో జర్మన్లను చీల్చి చెండాడుతూంది.

త్వరలో రెడార్మీ యుగోస్లావియాలోని టిటోసేనలతో చేతులు కలుపుతుంది. తత్ఫలితంగా ఉత్తర ఇటలీపై ఒత్తిడి హెచ్చుతుంది. తూర్పునుంచి మిత్రసేనలు అప్పుడే ఉత్తర ఇటలీలో చొరబడ్డాయి, ఇక ఇక్కడి నాజీమూకలకు పలాయనం చిత్తగించడమో, లేక సర్వనాశనం కావడమో తప్ప వేరేగతి ఉండదు. అంతేగాకుండా గ్రీసు, ఆల్బేనియాలకుకూడా త్వరలో దాస్యవిముక్తి లభించగలదు.

ప్రధాన రంగం

పోలండు, తూర్పుప్రష్యా, బాల్టిక్‌రంగాలలో రెడార్మీ జర్మన్ ప్రతిఘటనను విచ్ఛిన్నం చేస్తూంది. జర్మన్లు తమసర్వస్వాన్నొడ్డి ఇక్కడ ప్రతిఘటిస్తున్నారు. ఎందువల్ల ? 'హిందుస్థాన్ టైమ్సు' పత్రిక లండను విలేఖరిరాస్తున్నట్లు ఈమహాయుద్ధం యొక్క అంతిమఫలితాలను తేల్చగలది ఈరంగమే. "అక్కడ చూడవలసింది ఎంత దూరం ముందుకు పోయారు, ఎన్ని ప్రదేశాలు పట్టుకున్నారన్నదికాదు. జర్మన్‌రిజర్వు సేనలగతి కొద్దిరోజులలోనే అక్కడ తేలిపోతుంది. వాటిపని పట్టడం పూర్తికాగానే రెడార్మీ అడ్డూఆపూలేని ప్రవాహంలాగా పొంగి జర్మనీని ముంచెత్తుతుంది." అని విలేఖరి రాశాడు.

ఫిన్లండు

ఈ రెడార్మీ విజయాల ఫలితంగా ప్రజా పక్షానికి మరో లాభం చేకూరింది. జర్మనీని అంటిపెట్టుకొని ఉండటం ఇక లాభంలేదని ఫిన్లండు ప్రభుత్వం గ్రహించింది. జర్మనీని విడిపోయి, సోవియట్‌తో ఒడంబడిక కుదుర్చుకోడానికి నిర్ణయించింది. ఈ కోర్కెను సోవియటుకు తెలిపింది. "సెప్టెంబరు 15 వ తేదీ లోగా మాదేశం వదలిపొండని" దేశంలో ఉన్న జర్మన్ సేనలను కోరింది.

ఫిన్లండు ఈ యుద్ధంలోంచి విరమించి, శాంతిని అనుభవించడానికి సోవియట్ ఎన్నోసార్లు అవకాశం కలిగించింది. మిత్రరాజ్యాలుకూడ బోధచేశాయి. కాని ఫిన్లండు పాలకవర్గం ఆ అవకాశాలన్నింటిని కాలదన్నింది. ఈనాడు జర్మన్ తోడిదొంగల అండ ఇక వారికిలేదు. సోవియటుని శరణు వేడక తప్పిందికాదు. ఫిన్లండు ప్రజలకు శాంతి చేకూర్చడానికి సోవియట్ ఎప్పుడూ సుముఖంగానే ఉంది. యుద్ధ విరామం గురించి ఫిన్లండు రాయబారవర్గంతో త్వరలో సంప్రదింపులు జరుగగలవు. జర్మన్ మూకల నిష్క్రమణ, సోవియట్లతో శాంతి ఒడంబడిక - వీటిఫలితంగా ఫిన్లండులో త్వరలో గొప్పమార్పులు రాగలవు. ప్రజాస్వామ్య శక్తుల నాయకత్వం క్రింద ఫిన్లండు ప్రజలు శాశ్వత శాంతి, అభివృద్ధులు పొందగల పరిస్థితులు ఏర్పడగలవు.

4—9—44

— కాపి మోహన్‌రావు

కృష్ణాజిల్లా ఈనాం రైతుల మహాసభ

ఇటీవల మద్రాసు ప్రభుత్వంవారు ప్రజాభిప్రాయంకొరకు ప్రకటించిన ఎస్టేటుల్యాండు అక్టు సవరణలనుగూర్చి ఈనాం రైతుల అభిప్రాయం తెలియపర్చుటకుగాను కృష్ణాజిల్లా ఈనాంరైతుల మహాసభ 30—8—44 న గుడివాడలో సుప్రసిద్ధ కాంగ్రెసువాదులును, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ వర్కింగుకమిటీ సభ్యులునైన శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గారి అధ్యక్షతను జరుపబడెను.

సభకు అన్నితాలూకాలనుండి 500 మంది రైతులు హాజరయిరి. ముఖ్యంగా గుడివాడ తాలూకాలోని సోమవరప్పాడు, గండేపూడి వగైరా గ్రామాలనుండి యీనాం రైతులు అన్నంమూటలతో సహా వచ్చి సభలో పాల్గొన్నారు.

సభ మధ్యాహ్నం గం. 3 లకు గౌరీశంకర హాలులో ప్రారంభమైంది. కేతవరపు నరసింహంగారు, సూరంపూడి శ్రీహరిరావుగారు మొదలగు కాంగ్రెసు వాదులు, త్రిపురనేని కాశీవిశ్వనాథం బి. ఎ. బి. యల్. గార్లు సభకు హాజరయ్యారు.

అధ్యక్షులు ప్రస్తుతబిల్లునుగూర్చి, ఈనాం రైతుల కష్టాలనుగూర్చి విపులంగా మాట్లాడి, అగ్రహారం రైతుల కష్టాలను తీర్చి వారి హక్కులను కాపాడుటకు యెక్కువ కృషి జరగలేదనీ, యిందుకు కారణం పైతరగతి ప్లీడర్లు వగైరా యీనాందారులో, లేక వారి బంధువులో అయివుండడమని చెప్పారు. ఈనాం రైతులుకూడా రైతుసంఘాల్లోచేరి, రైతుసంఘాలను బలపర్చుట ద్వారా తమ హక్కులను కాపాడుకోవాలని వుద్బోధించారు.

తరువాత అధ్యక్షస్థానం నుండియే ప్రభుత్వంవారు ప్రకటించిన చిత్తుబిల్లుకు ఆంధ్రరాష్ట్ర ఈనాం రైతుల కమిటీవారు సూచించిన సవరణలను బలపరుస్తూ, ఆంధ్ర రాష్ట్ర ఈనాందార్ల సంఘం ఇటీవల బెజవాడలో సమావేశమై 50 ఎకరముల మాగాని, 100 ఎకరముల మెట్టవున్న యీనాందార్లకు యీ బిల్లు వర్తించకూడదని చేసిన సూచనను ఖండిస్తూ, పై యీనాందార్ల సూచనను ప్రభుత్వం ఆమోదించకుండా రైతుకు సంపూర్ణ న్యాయం కలుగచేయాలనీ కోరుతూ, తీర్మానం ప్రవేశపెట్టిరి.

కృష్ణాజిల్లా రైతుసంఘాధ్యక్షులైన శ్రీ అనుమర్లపూడి వెంకట సీతారామారావు గారు తీర్మానాన్ని బలపరుస్తూ యీనాందార్లకు 50 యకరాలు మాగాణి, 100 ఎకరాల మెట్ట మినహాయిస్తే, వున్న యీనాం అన్నిటినీ, వారు పిల్లలపేర, పెద్దలపేర విభజించుకొనుట ద్వారా బిల్లునుండి తప్పించుకొని, రైతులకు కలుగవలసిన న్యాయమైన జిరాయితీహక్కు కలుగకుండా చేస్తారు కాబట్టి, ఆ మినహాయింపును ఆమోదించగూడదని స్పష్టపరచారు. పిమ్మట శ్రీ సూరంపూడి శ్రీహరిరావు, చలసాని రామచంద్రయ్యగార్లు తీర్మానాన్ని బలపరుస్తూ మాట్లాడారు.

END OF ISSUE